తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY
సంపుటి : 23 సంచిక : 09 | శనివారం డిసెంబర్ 21 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

అమరన్‌కు అవార్డుల పంట.. ఉత్తమ నటుడిగా విజయ్‌సేతుపతి

8 లో..

ఇదండీ..కబురు..



వీడు గురుకులానికెళ్లి పాఠాలు కాదుగానీ, పాములు పట్టడం నేర్చుకున్నాడు!



## ఈ-ఫార్ములా సంస్థతో
# కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

- రూ. 600 కోట్లు లూటీకే ఫార్ములా ఈ-రేస్
- విచారణలో ఉన్నందున వివరాలు వెల్లడించలేను
- సభలో సీఎం రేవంత్ రెడ్డి వివరణ

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 20

ఈ-ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈ-ఫార్ములా కేసుపై సీఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఏసీ మీటింగ్‌లో 9 అంశాలు ఇచ్చారు.. దీంట్లో ఈ ఫార్ములా గురించి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రతినిధి తనను కలిశారని.. ఎవరు వచ్చినా అందరినీ కలుస్తానని చెప్పారు. ఈ ఫార్ములా ప్రతినిధిని తన ఇంట్లో కలిశానని అన్నారు. తనకేం సంబంధం అని అడిగానన్నారు. కేటీఆర్‌తో అంత సెటిల్ చేసుకున్నానని ఫార్ములా ప్రతినిధి అన్నారు.. అధికారులతో మాట్లాడి చెప్తా అన్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ-కార్ రేస్ ప్రతినిధి తనను కలవడంతోనే ఈ బండారం బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏసీబీ విచారణలో ఉన్నందున ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక్కడ తానేం చెప్పినా కోర్టుకు వెళ్లి సీఎం తన మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని కోర్టుకు చెప్పుకుందాం అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరపాలని.. అధికారులకు సూచించానన్నారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు సభ జరిగింది.. కానీ దీని గురించి చర్చకి అడగలేదని అన్నారు. ట్విట్టర్ పిట్ట ఇన్నాళ్లు ఎక్కడ పోయాడు.. బీఆర్ఎస్ వాళ్లకు మెదడు కూడా పోయినట్టు ఉందని సీఎం దుయ్యబట్టారు. ఎక్కడికైనా వస్తా.. చర్చ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరం అనుకుంటే వాళ్ల పార్టీ ఆఫీస్ కి ఐనా వెళ్తానని తెలిపారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బులు లండన్ కంపెనీకి ఎలా వెళ్ళాయని సీఎం అడిగారు. ఈ-కార్ రేస్ అగ్రిమెంట్ రూ.55 కోట్లు కాదు.. రూ.600 కోట్లు అని ముఖ్యమంత్రి తెలిపారు. రూ. 600 కోట్లు లూటీ చేయాలని ఫార్ములా ఈ-రేస్ తెచ్చారని సీఎం పేర్కొన్నారు. నగదు బదిలీ చేయాలంటే ఆర్బీఐ అనుమతి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

2 లో




2 లో

## అంబేద్కర్ వల్లే మోదీ, అమిత్ షాకు పదవులు

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 20

కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఇదే సమయంలో అంబేద్కర్ రాజ్యాంగం వేరు.. భగవంతుడు వేరు అన్న విషయం అమిత్ షా గుర్తించాలి అంటూ కామెంట్స్ చేశారు.

తాజాగా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..‘అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించిన విధానంపై రాహుల్ గాంధీ గళం విప్పారు. పార్లమెంట్ నిండు సభలో అంబేద్కర్‌ను అవమానించేలా అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొనే వరకు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు.



## కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలని కాంగ్రెస్ కుట్ర

### - కావాలనే బీఆర్ఎస్‌పై బురదజల్లే యత్నం : హరీశ్‌రావు

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 20

కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని చెప్పారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఎలాంటి తప్పు చేయలేదన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా-ఈ రేస్ నిర్ణయం తీసుకున్నామన్నారు.

2 లో



## జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 20

పార్లమెంటులో అంబేద్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు.“జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే” అని సీతక్క చెప్పారు.

2 లో

## భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు

### - మంత్రి పొంగులేటి



కబురు, హైదరాబాద్ డిసెంబర్ 20

గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి ఆందోళనల మధ్యే భూ భారతి బిల్లుపై పొంగులేటి తన ప్రసంగాన్ని కొనసాగించారు.“భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది.

మిగతాద్ది 2 లో



### శీతాకాల సమావేశాలు..

## లోక్‌సభ ఉత్పాదకత 58 శాతమే!

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 20

పార్లమెంటు శీతాకాల సమావేశాలు .. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలు సహా కొన్ని అసాధారణ ఘటనల మధ్య ముగిశాయి. రాజ్యాంగంపై చర్చ, జేపీసీకి జమిలి బిల్లులు పంపించడం వంటివి జరిగినప్పటికీ.. బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూమ్ మంత్రి అవమానకర వ్యాఖ్యలు చేశారని విపక్షాల ఆరోపణలతో ఉభయ సభలు అట్టుడికాయి. అమిత్ షా రాజీనామా చేయాలన్న విపక్షాల నిరసనల మధ్య ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే చివరి రోజు ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో శీతాకాల సమావేశాల ఉత్పాదకత భారీగా పడిపోయినట్లు వెల్లడైంది.

02

## ఫార్ములా-ఈరేస్ కేసులో అణాపైసా అవినీతి జరగలేదు

### న్యాయపరంగానే అన్నీ ఎదుర్కొంటాం : కేటీఆర్

కబురు, హైదరాబాద్ డిసెంబర్ 20

ఫార్ములా-ఈ రేస్ కేసులో అణాపైసా అవినీతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలతో ఈ కేసులో అవినీతి లేదని తేలిందన్నారు. ప్రొసీజర్ కరెక్ట్‌గా లేదని మాత్రమే అన్నారని చెప్పారు. ప్రభుత్వం కేసుపై ముందుకు వెళ్తే న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. హెచ్ఎండీఏ ఒక కార్పొరేషన్ అని, హైదరాబాద్ నగర ప్రగతికి పనికి వచ్చే ఏ కార్యక్రమానికైన డబ్బులు ఖర్చు చేయవచ్చని తెలిపారు. హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదని చట్టంలోనే ఉందన్నారు. దానికి ఆ మేరకు స్వతంత్రత ఉందని చెప్పారు.



2 లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# కుదుపు రేపే నిర్ణయం



భారత క్రికెట్ రంగంలో బుధవారం ఉరుము లేని పిడుగు పడింది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా భారత జట్టు అయిదు టెస్టులు ఆడుతుండగా సిరీస్ మధ్యలోనే అగ్రశ్రేణి భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన రిటైర్మెంట్ ప్రకటించడం అనేకమందిని ఆశ్చర్యపరిచింది. ఆస్ట్రేలియాలో బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లోని మూడో టెస్ట్‌తో పాటు అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ సైతం ముగిసింది. సంచలనం రేపిన ఈ వార్త పలు అనుమానాలు, ఊహాగానాలకు కూడా తెర తీసింది. తాజాగా పెర్త్, బ్రిస్బేన్ మ్యాచ్‌లలో తుది జట్టులో స్థానం దక్కకపోవడంతో అశ్విన్ స్వచ్ఛందంగా ఆట నుంచి రిటైర్ అవుతున్నట్టు ప్రకటించారు. 'సిరీస్‌లో ఇప్పుడు నా అవసరం లేనట్టయితే, ఆటకు గుడ్‌బై చెప్పేస్తాను' అంటూ రిటైర్మెంట్‌కు ముందు భారత కెప్టెన్ రోహిత్ శర్మకు ఆయన తేల్చిచెప్పేశారు. 'ఆడే సత్తా నాలో ఇంకా మిగిలే ఉంది. బహుశా, (ఐపీఎల్ లాంటి) క్లబ్%–%స్థాయి క్రికెట్‌లో దాన్ని చూపుతాను. భారత జట్టు తరపున ఆడడం మాత్రం ఇదే ఆఖరి రోజు' అన్న అశ్విన్ ప్రకటన క్రికెట్ అభిమానులు జీర్ణించుకోలేని విషయమే.మొత్తం 106 టెస్టుల్లో 537 వికెట్లు సాధించిన అశ్విన్ అత్యధిక వికెట్లు పడగొట్టిన రెండో భారత క్రికెటర్. 132 మ్యాచ్‌లలో 619 వికెట్లు సాధించిన నిన్నటి తరం అగ్రశ్రేణి స్పిన్నర్ అనిల్ కుంబ్లే తరువాత అలా ద్వితీయ స్థానంలో నిలిచారు అశ్విన్. బంతితోనే కాదు... బ్యాట్‌తోనూ అరడజను శతకాలు, 14 అర్ధ శతకాలతో 3,503 పరుగులు సాధించిన ఘనత ఆయనది. ఇంకా చెప్పాలంటే, గత 14 ఏళ్ళ పైచిలుకు కాలంలో స్వదేశంలో భారత జట్టు తిరుగులేని శక్తిగా ఎదగడం వెనుక ఈ తమిళ తంబి కీలక పాత్రధారి. ఈ ఏడాది బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆయన ఏకంగా 11వ సారి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికై, ప్రపంచ రికార్డును సమం చేశారు. బరిలో ఓర్పు, బంతి విసరడంలో నేర్పు, ప్రత్యర్థిని బోల్తా కొట్టించడంలో నైపుణ్యం ఉన్న తెలివైన ఆటగాడాయన.అందుకే, ఆటలో ఈ అగ్రశ్రేణి ఆఫ్ స్పిన్నర్ చూపే ప్రతిభకు ప్రేక్షకులు జేజేలు పలికారు. ప్రస్తుత భారత జట్టు బౌలర్లలో ప్రత్యేకంగా నిలిచారు. ఏ క్రికెటరైనా విదేశాల్లో కాకుండా సొంతగడ్డపై ఆటకు స్వస్తి పలకాలనుకుంటారు. అది సర్వసాధారణం. ఎందుకంటే, స్వదేశంలో సొంత క్రీడాభిమానుల జయజయ ధ్వానాల మధ్య ఘనంగా వీడ్కోలు పలకవచ్చని భావిస్తారు. కానీ, అశ్విన్ అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించారు. దానికి కారణాలు లేకపోలేదు. ఆడే సత్తా ఉన్న ఏ క్రీడాకారుడైనా బరిలో ఉండాలనుకుంటాడే తప్ప, అవకాశం కోసం నిరీక్షిస్తూ బెంచ్ మీద కూర్చొనే జాబితాలో చేరాలనుకోడు. అది ఎవరికైనా బాధాకరమే. అలాంటిది... టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఆరు టెస్ట్ సెంచరీలు, 500కు పైగా వికెట్లు తీసుకొన్న ఏకైక క్రికెటర్‌కు తరచూ అలాంటి అనుభవం ఎదురైతే? అది మరింత బాధ కలిగిస్తుంది. 38 ఏళ్ళ వయస్సులో, కెరీర్‌లో కాలం కరిగిపోతున్న వేళ... అశ్విన్‌కు అది అవమానమూ అనిపించింది. భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా సిరీస్‌లో మధ్యలో ఆయన హఠాత్తుగా తన రిటైర్మెంట్ ప్రకటించారనుకోవాలి. సరిగ్గా పదేళ్ళ క్రితం 2014 డిసెంబర్‌లో మరో అగ్రశ్రేణి భారత క్రికెటర్ ధోనీ సైతం ఇలాగే ఆటకు అల్విదా చెప్పారు. ఈ వాస్తవ పరిణామాలన్నీ గమనిస్తూ, క్షేత్రస్థాయి అంశాలను గమనంలోకి తీసుకున్న వారికి మాత్రం అశ్విన్ నిర్ణయం మరీ దిగ్భ్రాంతికరంగా తోచదు. అదే సమయంలో జీవితంలో, ఆటలో అత్యంత కఠినమైన ఈ నిర్ణయం తీసుకుంటున్నప్పుడు కూడా విమర్శల జోలికి పోకుండా, పక్కా జెంటిల్మన్‌గానే వ్యవహరిస్తూ అశ్విన్ తన నిర్ణయాన్ని ప్రకటించడం చెప్పుకోదగ్గ విషయం. ఆస్ట్రేలియా సిరీస్‌లోని తొలి మూడు టెస్టుల్లో అడిలైడ్‌లోని రెండో టెస్ట్‌లో మాత్రమే అశ్విన్‌కు జట్టులో స్థానం దక్కింది. ప్రతిభావంతుడైన పాతికేళ్ళ వాషింగ్టన్ సుందర్ అంతకంతకూ ముందు కొస్తూ, అశ్విన్‌ను పక్కకు జరిపి జట్టులో చోటు సంపాదించుకుంటూ పోతున్నారు. ఫలితంగా అశ్విన్ హుందాగానే పక్కకు తప్పుకున్నారు. వికెట్లు పడగొట్టడంలో పేరున్న ఈ స్పిన్నర్ నిర్ణయం 'వ్యక్తిగతం' అని రోహిత్ శర్మ చెప్పారు కానీ రిటైర్మెంట్ ప్రకటన అనంతరం విలేఖరుల ప్రశ్నలు వద్దని అశ్విన్ సున్నితంగానే తప్పుకోవడంతో కంటికి కనిపించని కథలున్నాయనే వాదనకు బలం చేకూరింది. అయితే, అశ్విన్ ఆది నుంచి జట్టు సమష్టి ప్రయోజనాలకై ఆడినవారే. అనేక సందర్భాల్లో సెలెక్టర్ల బంతాటలో వైట్ బాల్ గేమ్స్‌లో స్థానం దక్కించుకోకున్నా, పట్టుదలతో ఆడుతూ తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పటికీ కనీసం మరో రెండేళ్ళ పాటు అంతర్జాతీయ స్థాయిలో ఆడగల సత్తా ఆయనకుంది. అయినా పక్కకు తప్పుకున్నారు. గతంలో ధోనీ ఆస్ట్రేలియాతోనే మెల్ బోర్న్ టెస్ట్‌లో హుందాగా టెస్ట్ క్రికెట్ నుంచి పక్కకు తప్పుకొని, యువకులకు దోవ ఇచ్చారు. కార ణాలేమైనా, అశ్విన్ ప్రస్తుతానికి పెదవి విప్పి పెద్దగా చెప్పకుండానే పదవీ విరమణ ప్రకటించారు. పేరు ప్రతిష్ఠలు, డబ్బు అన్నీ కెరీర్‌లో భాగమైన ఆటగాళ్ళు వాటన్నిటినీ వదులుకొని, రిటైరవుతున్నట్టు చెప్పడం నిజానికి ఎప్పుడూ కష్టమే. అశ్విన్ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. కాకుంటే, పైకి గంభీరంగా కనిపిస్తూ భావోద్వేగాల్ని ప్రదర్శించకపోవడం విశేషం. అశ్విన్ వ్యక్తిగతం మాటెలా ఉన్నా, ఆయన నిష్క్రమణతో భారత క్రికెట్ ఇప్పుడో చిత్రమైన సంధి దశలో నిలిచింది. బహుశా, ఈ ప్రతిభావంతుడి తాజా నిర్ణయంతో ఒకప్పటి ఫామ్ కోల్పోయి, తడబడుతున్న రోహిత్ శర్మ, కోహ్లీలు సైతం ఆత్మపరిశీలనలో పడాల్సి రావచ్చు. ఎంతైనా ఆర్ట్ ఆఫ్ 'లీవింగ్' కూడా ఆర్ట్ ఆఫ్ 'లివింగ్'లో భాగమే కదా! వెరసి, అశ్విన్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి కోసం అన్వేషణతో పాటు ఆయన నిష్క్రమణకు దారి తీసిన పరిస్థితులపై చర్చ చాలాకాలం కొనసాగడం ఖాయం.

## ఫార్ములా-ఈరేస్ కేసులో

# అణాపైసా అవినీతి జరగలేదు

మొదటిపేజీ తరువాయి
అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సీఎంను ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేదా ముఖ్యమంత్రే అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. తనపై కేసు నిలవడదని స్పష్టం చేశారు. లీగల్‌గా ముందుకు వెళ్తామని, లంచ్ మోషన్ పిటిషన్‌పై కోర్టు తేలుస్తుందన్నారు.ఓఆర్ఆర్ లీజు అంశంలో సిట్ ఏర్పాటుపై కూడా కేటీఆర్ స్పందించారు. టీఓటీ పద్ధతి దేశంలో ఇప్పటికే అమలులో ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు డబ్బును రైతు రుణమాఫీకి ఉపయోగించామని చెప్పారు. ఆర్థిక వనరుల సమీకరణపై అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చింది. ఓఆర్ఆర్ నుంచి డబ్బులు సేకరించవచ్చని సూచించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారులు నుంచి డబ్బులు సేకరిస్తున్న టీఓటీ తరహాలోనే ఓఆర్ఆర్ లీజు నుంచి డబ్బులను సేకరించాం. ప్రైవేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చినట్టు ఆరోపిస్తున్న రేవంత్ ఆ కంపెనీతో లీజుని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో ఓఆర్ఆర్ లీజుపై రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడిన అడ్డగోలు మాటలపై హెచ్ఎండిఏ పరువు నష్టం కేసు వేసింది. ఇప్పటికీ ఆ కేసు అలాగే ఉంది. ముఖ్యమంత్రి ఓఆర్ఆర్‌పై అనేకసార్లు కుంభకోణం అని మాట్లాడారు. మరి ఆ లీజును ఎందుకు రద్దు చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి మున్సిపల్, హోంశాఖ మంత్రిగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో సిట్ ద్వారా తన పరిధిలో ఉన్న అధికారులతో వాస్తవాలు ఎలా బయటకు వస్తాయి. తన సొంత శాఖ అధికారులతో దర్యాప్తు చేస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయో రేవంత్ చెప్పాలి. అందుకే ఓఆర్ఆర్ లీజును వెంటనే రద్దుచేసి.. సిట్టింగ్ జడ్జితో కానీ రిటైర్డ్ జడ్జితో కానీ నిష్పాక్షిక విచారణ జరిపించాలి. ఒకవేళ కుంభకోణం జరిగి ఉంటే ఆయాచితంగా లబ్ధి జరిగిన కంపెనీని కాంట్రాక్టు ఎందుకు రద్దు చేయడం లేదు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించకుంటే ఇది మరొక రాజకీయ కక్ష సాధింపు కేసు అని ప్రజలు అనుకుంటారు. న్యాయమూర్తి ఏర్పాటు చేసే బృందం జాతీయ రహదారుల సంస్థ విధానాలను అధ్యయనం చేయాలని కూడా సూచిస్తాం. మాపై ఆరోపణలు చేసి కక్ష సాధింపుల కోసం మాత్రమే పరిమితం కాకుండా వాస్తవాలు తెలిసేలా మాట్లాడాలి. కోకాపేట భూములపై రూ.10 వేల కోట్ల కుంభకోణం అంటున్నారు. స్కామ్ అయితే ఆ భూముల అమ్మకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి' అన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చి స్పీకర్, ప్రతిపక్ష సభ్యులపైకి వాటర్ బాటిళ్లు, పేపర్లు విసరడం ఎలా అని శిక్షణ ఇచ్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. దళితుడు అంటూ పదే పదే చెప్పడం స్పీకర్ గౌరవాన్ని తగ్గించేలా చేయడమేనన్నారు.

# భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు

మొదటిపేజీ తరువాయి
సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళ్లు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు" అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

### హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం

అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. "హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?" అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలని కాంగ్రెస్ కుట్ర

మొదటిపేజీ తరువాయి
తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా మేం కూడా ప్రజలకు చెబుతాం. మీరు పెట్టింది అక్రమ కేసు కాకుంటే ఈ సభలో చర్చించాలన్నారు. తాము తప్పు చేయలేదని.. రాష్ట్రం కోసం చేశామని కేటీఆర్ చెప్పారన్నారు. అక్రమ కేసు పెట్టినప్పుడు కేటీఆర్‌కు చెప్పుకునే అవకాశం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై నిలదీస్తున్నందుకు, లగచర్ల రైతుల తరఫున పోరాటం చేస్తున్నందుకు కేటీఆర్‌పై కేసు పెట్టారని విమర్శించారు. ఈ క్రమంలో సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. అయితే ఫార్ములా–ఈ రేస్ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. అది ఒక సభ్యుడికి సంబంధించ అంశమని, ముందు బిల్లులపై చర్చిద్దామని స్పీకర్ అన్నారు. అందుకు ఒప్పుకోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫార్ములా–ఈ కార్ రేస్‌పై చర్చకు పట్టుపట్టారు. భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చను ప్రారంభించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

# అంబేద్కర్ వల్లే మోదీ, అమిత్ షాకు పదవులు

మొదటిపేజీ తరువాయి
చట్టాలు, న్యాయాలు అంబేద్కర్ రాజ్యాంగం వల్లే ఉన్నాయి. బీసీలుగా చెప్పుకొనే మోదీ, అమిత్ షా కూడా అంబేద్కర్ రాజ్యాంగం వల్లే పదవులు పొందారు.
అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశ ప్రజల భావాలు దృష్టిలో పెట్టుకొని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు. రాహుల్ గాంధీ బాధ్యత.. గాంధీ, నెహ్రూ అడుగుజాడల్లో నడవటం. అంబేద్కర్ రాజ్యాంగం వేరు భగవంతుడు వేరు అనే విషయం అమిత్ షా గుర్తించాలి. అమిత్ షా, రాహుల్ గాంధీకి తేడా.. రాహుల్ గాంధీ దేవుని మొక్కుతాడు కానీ పబ్లిసిటీ చేయరు. బీజేపీ నేతలు కూడా దేవుడ్ని మొక్కుతారు కానీ, పబ్లిసిటీ చేసుకుంటారు. దేవుడు అనేది నమ్మకం ధైర్యం.. భగవంతుడు అనేది వ్యక్తిగత విషయం. కాంగ్రెస్ కార్యకర్తలు రాహుల్ గాంధీ పిలుపునకు సిద్ధంగా ఉంటారు' అని కామెంట్స్ చేశారు.

# ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

మొదటిపేజీ తరువాయి
ఓఆర్ఆర్ టెండర్లు రద్దు చేయండని అంటున్నారు.. విచారణ జరగకుండా రద్దు చేస్తారా..? అని సీఎం ప్రశ్నించారు. విచారణ అడిగింది వాళ్ళే.. డిమాండ్ చేసింది వాళ్ళేనని సీఎం తెలిపారు. చర్చకు నేను వెనక్కి పోయే వాడినా అధ్యక్షా.. దేని మీద నైనా చర్చకు సిద్ధంగా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారు. హరీష్ రావు అడిగితేనే ఓఆర్ఆర్ పై సిట్ వేశామన్నారు. ఈ విషయంపై కేసీఆర్ ఇంట్లో గొడవ జరిగిందని తెలిపారు. ఇంటికి వెళ్లాక హరీష్ కు కొరడా దెబ్బలు ఉంటాయన్నారు. హరీష్ బాధను తాను అర్థం చేసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## శీతాకాల సమావేశాలు..

# లోక్‌సభ ఉత్పాదకత 58 శాతమే!

మొదటిపేజీ తరువాయి
నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు.. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాల మధ్యే కొనసాగాయి. చివరి రోజు లోక్‌సభ ప్రారంభమైన కేవలం మూడు నిమిషాలకే సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మొత్తంగా ఈ సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 58 శాతంగా ఉన్నట్లు సెక్రటేరియట్ వెల్లడించింది.రాజ్యసభలోనూ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్ షా అవమానించారని ఆరోపిస్తూ విపక్షాలు తీవ్ర ఆందోళన చేపట్టాయి. శుక్రవారం సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తంగా ఈ సెషన్‌లో రాజ్యసభ 43గంటల 27నిమిషాలు పనిచేసిందని, తన నిర్దిష్ట పనిగంటల్లో 40.03% మాత్రమేనని పేర్కొన్నారు.

# తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం

## ఈ కార్ రేసింగ్‌పై చర్చకు బిఆర్ఎస్ పట్టు

- భూభారతిపై చర్చను అడ్డుకునే యత్నం
- స్పీకర్‌పై పేపర్లు చించి విసిరిన సభ్యులు
- నిరసన తెలుపుతూ సభ నుంచి వాకౌట్

**హైదరాబాద్,డిసెంబర్20**
తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ–రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఫార్ములా ఈ–రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో ఏ–1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ–రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని భారాస సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ–రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అంతకుముందు భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు. కేటీఆర్‌ను అప్రతిష్ఠ పాల్జేసి భారాసను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఈ అంశంపై రకరకాల లీకులు ఇస్తున్నారు. మేం ఎలాంటి తప్పు చేయలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ–రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తాం'అని హరీశ్‌రావు అన్నారు. అయితే స్పీకర్ వారిని వారించినా వినలేదు. భూభారతిపై చర్చకు పల్లా రాజేశ్వర్ రెడ్డికి అవకాశం ఇచ్చినా మాట్లాడలేదు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలి .. ఎంపీఓ



కబురు న్యూస్ బాన్సువాడ, డిసెంబర్ 20

బాన్సువాడ మండలంలోని ఇబ్రహింపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును శుక్రవారం ఎంపీఓ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రజాపాలన దరఖాస్తుల వచ్చిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## దేశాయిపేట్ లో రెండు లేగ దూడలకు జన్మనిచ్చిన ఆవు



కబురు న్యూస్, బాన్సువాడ డిసెంబర్ 20

బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన గాండ్ల సాయిలు కు చెందిన అవు శుక్రవారం రెండు లేగ దూడలకు జన్మనివ్వడంతో రైతు ఆనందం వ్యక్తం చేశారు. గోపాల మిత్రులు గంగాధర్, రాములు ఆవు సుఖ ప్రసవం అయ్యేలా చేశారు. శుక్రవారం రోజున లేగదూడలు జన్మించడంతో లక్ష్మీదేవి తన ఇంటికి వచ్చినట్లుగా ఉందని రైతు సంతోషం వ్యక్తం చేశారు. రెండు లేగ దూడలు ఆరోగ్యంగా ఉండడంతో రైతు సంబరపడ్డారు.

## కేంద్రమంత్రి అమిత్ షాను పార్టీనుండి సస్పెండ్ చేయాలి... కాంగ్రెస్ నాయకులు



కబురు న్యూస్ బాన్సువాడ, డిసెంబర్ 20

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించి బిజెపి పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం కోసం రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి హెూదాలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, సీనియర్ నాయకులు మాసాని శ్రీనివాస్ రెడ్డి, పాత బాలకృష్ణ, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారాయణ,కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్,అంబర్ సింగ్, గోపాల్ రెడ్డి, అక్బర్, నరేష్ రాథోడ్, రహీం, లయాక్, భీమశంకర్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్




కబురు న్యూస్ హైదరాబాద్, డిసెంబర్ 20

హైదరాబాదులోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, రైతంగాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిన్నారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మతసామరస్యానికి ప్రతీకగా ప్రెస్ క్లబ్ లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు

- నూడ ఛైర్మెన్ కేశ వేణు...

కబురు న్యూస్,నిజామాబాద్,డిసెంబర్ 20 :



ఏసు ప్రభువు బోధనలు ఆయన చూపిన శాంతి,ప్రేమ,సౌభ్రాతృత్వం,సహనమనే గొప్ప లక్షణాలు ఎప్పటికీ అనుసరణీయమని నిజామాబాద్ నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. నగరంలోని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సపోజ్ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూడ ఛైర్మెన్ కేశ వేణు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లాలో క్రైస్తవులకు సపోజ్ క్రిస్మస్ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సౌభ్రాతృత్వం,కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని తెలిపారు. రాష్ట్రంలో సెక్యులర్(మత సంబంధం లేని) ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడుకుంటూ పరిపాలన పారదర్శ కంగా, ప్రజాస్వామికంగా తెలంగాణ రాష్ట్రంలో సాగుతుందని పేర్కొన్నారు. క్రిష్టియన్ సోదరులు సంతోషంతో, ఆనందోత్సహాలతో క్రిస్మసన్ను జరుపుకోవాలనీ క్రీస్తు మార్గాన్ని అనుసరించి సమాజ అభివృద్ధి కోసం అందరు పాటుపడాలని సూచించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఆయన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల రామకృష్ణ, బైర శేఖర్ లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ప్రెస్ క్లబ్లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు జరపడం జరిగిందన్నారు. కుల, మతాలకతీతంగా అన్ని పండగలను ప్రతి సంవత్సరం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు.

నిజామాబ్బాద్ సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ప్రకాష్,తెలంగాణ యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు జకర్యా ఆనంద్,ప్రధాన కార్యదర్శి డానియల్,కోశాధికారి జాన్ బనియన్,సపోజ్ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. సపోజ్ క్రిస్మస్ వేడుకలపై క్లుప్తంగా వివరించారు. సిఎస్ ఐ చర్చ్ కమిటీ ఆధ్వర్యంలో పాటలు ఆలపించడంతో ప్రతి ఒక్కరిని అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు నుడా చైర్మన్ కేశవ వేణు తో పా పాస్టర్లు,జర్నలిస్టుల మధ్యలో సపోస్ క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబర్షాలను ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అతిథులకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి సందీప్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్ ,నగర జర్నలిస్టులు సదానంద్,కొక్కు రవి కుమార్, అనంద్ పాల్,రాజేశ్వర్,రాజ్ కుమార్,జాక్సన్,ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, నగర జర్నలిస్టు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో బోధన్ యువకుడు మృతి...

కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 20..



బోధన్ పట్టణంలోని గౌడ్స్ కాలనీకి చెందిన యువకుడు నీరజ్ గౌడ్ అమెరికాలో ఈ నెల 16న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన శంకర్ గౌడ్-నళిని దంపతుల కుమారుడు పంజాల నీరజ్ గౌడ్ (23) ఉన్నత విద్యను అభ్యసించేందుకు గత సంవత్సరం అమెరికా కు వెళ్ళాడు. మరో రెండు నెలల్లో తిరిగి ఇంటికి వస్తాడనుకున్న కొడుకు మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని అమెరికా నుండి స్వస్థలానికి తెప్పించే ప్రయత్నం జరుగుతుందని భాధిత బంధువులు తెలిపారు.

## ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన



కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, డిసెంబర్ 20 :

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసనగ ఐద్వా ఆధ్వర్యంలో నాగారంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా భారత దేశ ప్రజల ఏ రకమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. విద్య, వైద్యం,మహిళలపై హింస వీటి గురించి మాట్లాడకుండా పార్లమెంటులో అంబేద్కర్ ను అవమానించే విధంగా మాట్లాడడం ఆయన స్థాయిని దిగజార్చినట్లుందన్నారు.అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని,లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు రజియా,నగర నాయకులు రేఖ,శ్రీదేవి,పద్మ,యశోద,శిరీష,నాగారం ప్రాంతవాసులు, 80 క్వార్టర్స్ వాసులు ఆర్ జి కే వాసులు, దొడ్డి కొమురయ్య నగర్ వాసులు, బహుజన కాలనీ వాసులు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరానికి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 20 :




జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జూనియర్ బాలికల కబడ్డీ జట్టును శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు.ఈ ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు వీరిలో ప్రతిభ కనబరిచిన 15 మంది ప్లేయర్స్ ని శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు.వీరిలో సైతం రాణించిన క్రీడాకారులను 12 మంది ఎంపిక చేసి ఈనెల 22న హకీంపేట్ హైదరాబాదులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ లింగయ్య గంగాధర్ రెడ్డి లు తెలిపారు.శిక్షణ శిబిరంలో నేర్చుకున్న నైపుణ్యాలను రాష్ట్రస్థాయిలో ప్రదర్శించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి పేట ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్ జిల్లా కబడ్డీ సంఘ బాధ్యులు రాజేందర్ రాజ్ కుమార్ అనురాధ జ్యోతి నాగభూషణం గంగాధర్ రాజేశ్వర్ సురేష్ బ్రిజేష్ రాజ్ కుమార్ పిడి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ లో ఫోర్జరీ సర్టిఫికెట్ కలకలం...

కబురు న్యూస్,బోధన్ డిసెంబర్20..




బోధన్ పట్టణంలో ఫోర్జరీ సంతకం చేసిన సర్టిఫికెట్ కలకలం సృష్టించింది. బోధన్ తహసిల్దార్ సంతకంతో జారీ అయిన ఈ సర్టిఫికెట్ పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మీసేవ కేంద్రాల ద్వారా జారీ అయ్యే సర్టిఫికెట్ లు రెవెన్యూ కార్యాలయంలో కొందరు వ్యక్తుల సహకారంతోనే ఫోర్జరీ సంతకాలతో కూడిన సర్టిఫికెట్లు జారీ అవుతున్నట్లు తెలుస్తోంది. బోధన్ మున్సిపాలిటీలో శానిటేషన్ విధులు నిర్వహించడానికి కొందరు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో మున్సిపాలిటీలోని వివిధ విభాగాలలో విధులు నిర్వహించి మృతి చెందిన సిబ్బంది యొక్క కుటుంబ సభ్యులు కూడా దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ క్రమంలో కొందరు ఉద్యోగ బయోడేటాలో ఫోర్జరీ సర్టిఫికెట్లు జత చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫోర్జరీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి రాగానే మీసేవ కేంద్రాలపైన డాక్యుమెంట్ రైటర్ల పైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ ను వివరణ కోరగా తమ వద్దకు వచ్చిన దరఖాస్తులను పరిశీలన నిమిత్తం తహసీల్దార్ కార్యాలయం కు పంపించడం జరిగిందని అన్నారు. తహసీల్దార్ ను వివరణ కోరగా ఫోర్జరీ సర్టిఫికెట్ల వ్యవహారం తన దృష్టికి రాలేదన్నారు. తన దృష్టికి రాగానే తగిన విచారణ జరిపిస్తామని తెలిపారు.

## విద్యుత్ ఉద్యోగుల రక్తదానం

కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 20 :



తలసేమియా బాధితుల కోసం విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు.గోల్డెన్ జుబ్లీ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉద్యోగుల రక్తదాన శిబిరాన్ని ఎస్ ఈ రాపెల్లి రవీందర్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ,రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో సంస్థ ఉద్యోగులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బి ఆంజనేయులు,డీఈలు జాడే ఉత్తమ్,వెంకటరమణ,రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్,కోశాధికారి రవీందర్ నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం,పీవో పోశెట్టి,విద్యుత్ జేఏసీ నాయకులు పి గంగాధర్,సురేశ్ కుమార్,గంగారాం నాయక్, ఎం అశోక్,కాశీనాథ్, రాజేందర్ రెడ్డి,బాబా శ్రీనివాస్, నగేశ్ కుమార్,శివ,రఘు పాల్గొన్నారు.సుమారు 50 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు.

## భవన నిర్మాణ కార్మిక రంగం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంటుగా వేణు

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, డిసెంబర్ 20 :



భవన నిర్మాణ కార్మిక రంగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా వేణు నియామకమయ్యారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో గల ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ధర్పల్లి చంద్రం హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా భవన నిర్మాణ రంగం జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన వేణును రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు.



## మున్సిపల్ కార్మికులకు పిఆర్సీ వేతన బకాయిలు చెల్లించాలి...

కబురు న్యూస్,బోధన్ డిసెంబర్20..

బోధన్ మున్సిపల్ లో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, ట్రాక్టర్ డ్రైవర్లు,వాటర్ వర్క్స్ తదితర విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు పిఆర్సీ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మహాలక్ష్మి మందిరం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలను నెలకు 26 వేల రూపాయల చొప్పున పెంచివ్వాలని, పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ కార్మికుల వేతనాల నుండి కట్ చేసి ఎప్పటికప్పుడు జమ చేయాలని కార్మికులకు పనిముట్లు, రక్షణ కవచాలను ఇవ్వాలన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేటీఆర్ పై కేసు

- ఫార్ములా ఈ రేసులో 55 కోట్ల అవినీతి...
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి...

కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 20 :

ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ 55 కోట్ల అవినీతికి పాల్పడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేటీఆర్ పై కేసు నమోదు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆరోపించారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,ఫార్ములా ఈ రేసు కేసులో భాగంగా గవర్నర్ ఆమోదం తెలపడంతో ఏ1 గా ఉన్న కేటీఆర్ పై ఎఫ్ ఐ ఆర్ నమోదు కావడంతో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన పడుతూ రేవంత్ రెడ్డి పై దుష్ప్రచారం చేసే విధంగా పాల్పడుతున్నారని, గత సంవత్సర కాలంగా కేటీఆర్ హరీష్ రావు వాస్తవాలను పక్కన పెడుతూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. ఫార్ములా ఈ రేస్ లో భాగంగా కేటీఆర్ చేసిన అడ్డగోలు ఒప్పందాల వల్లనే ఆయనపై కేసు నమోదు చేయడం జరిగిందని




ఆరోపించారు.ప్రభుత్వానికి జిహెచ్ఎంసి కి మంత్రి వర్గానికి ఎలాంటి సంబంధం లేకుండా కేవలం కేటీఆర్ పురపాలక మంత్రిగా విచక్షణ రహితంతో అధికారాన్ని వాడుకొని రాష్ట్రంలో ఈ రేసును నిర్వహించడం జరిగిందన్నారు. ఫార్ములా ఈ రేసు ద్వారా అక్కడ ఉన్న ప్రజలు ఎంత ఇబ్బంది పడ్డారో రాష్ట్రమంతా చూశారని,ఫార్ములా ఈ రేసులో భాగంగా కేటీఆర్ 55 కోట్ల అవినీతి చేశాడని ఏసీబీ కేసు నమోదు చేస్తే దీనిని శాసనసభలో చర్చించాలని పక్కదారి పట్టించే ప్రయత్నం టిఆర్ఎస్ నాయకులు చేస్తున్నారని మానాల మోహన్ రెడ్డి దుయ్యబట్టారు. నిజానికి ఫార్ములా ఈ రేసు నిర్వాహణలో ప్రభుత్వం కేవలం మధ్యవర్తిత్వం వహిస్తూ సదుపాయాలను అందించడమే ఒప్పందం చేసుకుందని కానీ నిర్వహిస్తున్న కంపెనీల లాభనష్టాలకు ప్రభుత్వానికి సంబంధం లేదనే విధంగా ఒప్పందం చేసుకుంటే ఫార్ములా ఈ రేసు నిర్వహిస్తున్న క్రమంలో నిర్వహణ కంపెనీలకు 200 కోట్లు నష్టం రావడంతో కేటీఆర్ ప్రజాధనాన్ని 55 కోట్ల రూపాయలు వారికి దారాదత్తం చేశాడని, ఆ కారణంగానే కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేసిందని మానాల మోహన్ రెడ్డి వివరించారు. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని,దీనిని రాష్ట్ర ప్రజలు బిఆర్ స్ నాయకులు గమనించాలని మానాల మోహన్ రెడ్డి అన్నారు. కేటీఆర్ అరెస్ట్ అయితే రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు చేయాలని సందేశాన్ని పంపుతున్నాడని కానీ టిఆర్ఎస్ నాయకులు గమనించాలని అలర్లు చేస్తే తమ పిల్లల జీవితాలే నాశనం అవుతాయి కావున కేటీఆర్ ఈ రేసు కేసును ఏసీబీ వద్ద పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశం నూడా చైర్మన్ కేశవేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్,జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు వేణురాజ్ ,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్,అబూద్ బిన్ హన్దాన్, చందూర్ వైస్ ఎంపీపీ దశ గౌడ్,సాయికిరణ్,మాజీ కార్పొరేటర్లు స్వామి గౌడ్,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దడవై కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పీసీసీ చీఫ్ కలెక్టర్ కు లేఖ



కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 20 :

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు శ్రద్ధానంద్ గంజిలో పనిచేస్తున్న దడవై కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గతంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కి వినతి పత్రం అందజేశారు. పిసిసి అధ్యక్షుడి హోదాలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కార్మికులపై ఉన్న చిత్తశుద్ధితో జిల్లా కలెక్టర్ కి ప్రత్యేకంగా లేఖను రాసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరడం పట్ల ఐ ఎన్ టి యు సి నాయకులు మల్యాల గోవర్ధన్,దడువాయి యూనియన్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి ఆర్ రవీందర్ గౌడ్ లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ లేఖను జిల్లా కలెక్టర్ కి అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ,కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిగా వ్యవహరిస్తుంది అనడానికి అధ్యక్షుని హోదాలో జిల్లా కలెక్టర్ గారికి ప్రత్యేకంగా లేఖ రాయడమే నిదర్శనంగా కనబడుతుందన్నారు.అందుకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. దడువై కార్మికులకు వ్యవసాయ మార్కెట్ 15 కిలోమీటర్ల పరిధిలోని ఐకెపి సెంటర్లలో కార్మికులకు అవకాశం కల్పించాలని,కార్మికులకు కనీస వేతనాలు అందించాలని ఇందిరమ్మ ఇండ్లను కార్మికులందరికీ మంజూరు చేయాలని,కోరడం జరిగిందని అన్నారు. సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దడువాయి యూనియన్ గౌరవ అధ్యక్షులు లవంగా అశోక్,అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్,ప్రధాన కార్యదర్శి రణం రవీందర్ గౌడ్,ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్,పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను సన్మానించిన పెన్షనర్లు

కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 20 :



రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తానని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హామీ ఇచ్చారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అధ్యక్షులు కే .రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో కమిటీ కలిసింది. డిసెంబర్ 17 పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులను ఆయన అభినందించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని,సీనియర్ సిటిజన్స్ యొక్క అనుభవం కుటుంబానికి,సమాజానికి ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు కలెక్టర్ ని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా నాయకులు రామ్మోహన్ రావు,హమీద్దీన్,ఈవీఎల్ నారాయణ, ప్రసాద్,జీవన్ రావు,లక్ష్మీనారాయణ,బాబా గౌడ్,రైసుద్దీన్,బాలస్వామి తదితరులు ఉన్నారు.

# పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ క్రికెట్ టోర్నీ అభినందనీయం







- కులమతాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని చాటారు...
- విజేత,రన్నర్‌లకు ట్రోఫీలు,నగదు ప్రోత్సాహకాలు...
- అడిషనల్ డిసిపి బసవరేడ్డి,రైతు కమిషన్ సభ్యులు గడుగుగంగాధర్...

కబురు న్యూస్,నిజామాబాద్, స్పోర్ట్స్,డిసెంబర్ 20 :

పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పేరు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజయవంతం చేయడం అభిందనీయమని అడిషనల్ డిసిపి బసవరెడ్డి రేడ్డి అన్నారు. ఈ నెల 3 నుంచి 20వరకు పీసీసీ ఛీఫ్ మహేష్‌కుమార్ క్రికెట్‌కప్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంగా నిర్వహించగా ముగింపు శుక్రవారం పాలిటేక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ముఖ్య అథితిగా అడిషనల్ డిసిపి బసవరెడ్డి, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్‌లు హాజరైనారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ, ఆటల పోటీల్లో కులాలకు, మతాలకు తావివ్వకుండా అందరు స్నేహపూర్వకంగా ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే విదానాన్ని కొనసాగించాలన్నారు. ముఖ్యంగా క్రికెట్‌కు చాలా ఆదరణ ఉందని, ఆడినా, ఓడినా రెండు సమానంగా తీసుకోవాలన్నారు. ఆటలో గెలుపు, ఓటములు సహజమని అన్నారు. క్రీడా స్ఫూర్తి చాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. గత 18 రోజులుగా జిల్లాలో పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా జిల్లాలోని నలుమూలల నుంచి క్రిడాకారులు పాల్గొని ప్రాతినిత్యం వహించారు. విజేత,రన్నర్‌లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ మాట్లాడుతూ, జిల్లా నుంచి ఉన్నతంగా ఎదిగేలా క్రికెట్‌లో రాణించాలన్నారు. ప్రతినిత్యం ప్రాక్టీసు చేసి ఉన్నత –శిఖారాలను అధిరోహించాలన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విన్నర్, రన్నర్‌లకు ట్రోఫీలు, నగదు ప్రోత్సహాకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోటీపిసిసి రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు దయాకర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు రత్నాకర్, టోర్ని ఆర్గనైజర్ శ్రీనివాస్‌గౌడ్, ఎర్రం గంగాధర్, ఖుద్దుస్, శ్యామ్, తదివతరులు పాల్గొన్నారు.

అనంతరం విజేతగా నిలిచిన ఆరెంజ్ ఆర్మీ(రూ. 25వేలు నగదు)ట్రోపి అందజే
రన్నర్‌గా నిజామాబాద్‌స్టార్(రూ. 15వేల నగదు) ట్రోపి
మ్యాన్‌ఆఫ్‌దమ్యాచ్- శివ
బెస్ట్‌బ్యాట్స్‌మెన్ - శివ బెస్ట్ బౌలర్- చైనా రాజు
బెస్ట్‌ఫీల్డర్- జాఫర్
బెస్ట్ క్యాచ్- మీర్జాలకు ట్రోఫీలు అందజేశారు.

## భవన నిర్మాణ రంగ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు తగదు




కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 20 :

రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు ఇస్తామని చెప్పిన హామీలను అధికారంలోకి రాగానే మరిచిపోతున్నారని బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం అన్నారు.పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలుగుతామని అందుకోసం ఉద్యమాలు ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో భవన నిర్మాణ కార్మిక రంగాల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను ఘనంగా సన్మానించారు. అవగాహన సదస్సులో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జిల్లా అధ్యక్షుడు కల్లెడ గంగాధర్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి హామీలను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి నెరవేరుస్తామని అధికారంలోకి వచ్చినప్పటికీ ఇప్పటికీ హామీలను నెరవేర్చ లేదన్నారు. సమస్యల సాధన కోసం జనవరి 8,9తేదీలలో హైదరాబాద్లోని ధర్నా చౌక్ లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బాబురావు షిండే నరేందర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని అవమానించిన కాకతీయ పాఠశాల ఉపాధ్యాయుడు

- తీవ్ర మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం...
- సుభాష్ నగర్ కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో ఘటన...

కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 20 :

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాకతీయ విద్యాసంస్థలో శివ జశ్విత్ రెడ్డి అనుమానాస్పద మృతి ఘటన మరవకముందే మరో మరో ఘటన శుక్రవారం రోజున ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రులు,విద్యార్థి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాకతీయ ఒలంపియాడ్ విద్యాసంస్థలో 8 వ తరగతి విద్యార్థి తన్మయిని తోటి విద్యార్థుల ముందు అవమానించడంతో తీవ్ర మనస్థాపంకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది.తల్లిదండ్రులు,విద్యార్థి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్ కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో తన్మయి అనే విద్యార్థి 8వ తరగతి చదువుతున్నాడు.గత నాలుగు రోజుల క్రితం సదరు విద్యార్థికి మూత్రం రావడంతో ఉపాధ్యాయుడి



అనుతితో బాత్రూంకి వెళ్ళాడు.తొందరపాటులో ప్యాంటు జిప్ పెట్టుకోవడం మరచి పరుగు పరుగున తరగతి గదిలోకి వచ్చాడు.అది గమనించిన ఉపాధ్యాయుడు విద్యార్థి జీప్ పెట్టుకోలేదని స్టేజిపైకి ఎక్కించి జిప్ పెట్టుకోవడం మర్చిపోయాడంటూ,ఇటు చూడండంటూ తోటి విద్యార్థులకు చెబుతూ కాసేపు విద్యార్థిని స్టేజిపైనే నిలబెట్టాడు.దీంతో తోటి విద్యార్థుల మధ్య తీవ్ర మనస్థాపానికి గురై బాధపడ్డాడు.పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకుండా పలుమార్లు బోరున ఏడ్చాడు.తల్లిదండ్రులు కుమారుడిని విషయం అడుగగా ఏమాత్రం చెప్పలేదు.ఇటు తల్లిదండ్రులకు విషయాన్ని చెప్ప లేక అటు స్నేహితులకు మొఖం చూపించుకోలేక కొన్ని రోజులపాటు తల్లడిల్లి



పోయాడు.అంతటితో ఆగకుండా పలుమార్లు ఇంటి బంగ్లాపైకి ఎక్కి ఆత్మహత్యకు యత్నించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.దీంతో విద్యార్థి తల్లిదండ్రులు గురువారం పాఠశాలకు వచ్చి ఏం జరిగిందని ఆరా తీయగా విషయం కాస్త తల్లిదండ్రులకు తెలిసింది.ఈ విషయమై పాఠశాలలో ఇంచార్జికి అడగగా విచారణ చేపడతామని మాట దాట వేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు.ఇప్పటి వరకు ఈ ఘటనపై పాఠశాల స్పందించకపోవడంపై విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టి జిల్లా విద్యాశాఖ అధికారులు పోలీసు శాఖ వెంటనే స్పందించి న్యాయం చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.ఈ ఘటనపై మూడవ టౌన్ పోలీస్ స్టేషనులో,జిల్లా విద్యాశాఖ




అధికారికి ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు.అదేవిధంగా ఆన్లైన్లో బాలల హక్కుల చట్టం చైల్డ్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన అధికారులు విద్యార్థి నివాసానికి వచ్చారు.విద్యార్థితో ఘటనపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యార్థుల పట్ల నిరంకుషత్వానికి పాల్పడుతున్న నియంత కాకతీయ విద్యా సంస్థల యాజమాన్యంపై సంబంధిత శాఖ ఏ విధమైన చర్యలు చేపడుతుందో వేచి చూడవలసిందే మరి..

# సమగ్ర శిక్ష ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 20 :

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 14వ రోజు సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా అర్ధనగ్న ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు రాజు,భూపెందర్ లు మాట్లాడుతూ,తమ యొక్క న్యాయపరమైన డిమాండ్ల సాధన కొరకు 14 రోజులుగా నిరసనలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవట్లేదని,ఇకనైనా తమ న్యాయపరమైన



డిమాండ్ అయినా రెగ్యులరైజేషన్ సత్వరమే చేయాలని కోరారు.20 సంవత్సరాలుగా విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో అతి తక్కువ వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తూ విద్యాశాఖను సర్వతోముకాభివృద్ధికి తీసుకెళ్తూ కష్టపడుతున్న కనిస వేతనాలు లేక వీరి కుటుంబాలు ఆపసోపాలు పడుతున్నారని,మా యొక్క సమస్య పరిష్కారం కోసం ఒక 14 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోకుండా,ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై పరిష్కారం చూపుతామని చెప్తూ సాత్సారం చేస్తూ,సమగ్ర శిక్షా ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్,మహిళా అధ్యక్షురాలు గంగామణి,నాయకులు ప్రకాష్,అప్సర్,రవి కిరణ్,జాన్ సత్యపాల్ గంగాధర్,ప్రభు,రమేష్,రాణి, సుప్రజా,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా జర్నలిస్టుల సమస్యలపై కమీషనరుకు వినతిపత్రం

- టియుడబ్ల్యూజే మహిళా విభాగం జర్నలిస్టుల వినతి...

కబురు న్యూస్,హైదారాబాద్,డిసెంబర్ 20 :

మీడియా సంస్థల్లో వృత్తి పరంగా మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ సమాచార శాఖ కమిషనర్ ఎస్.హరిష్ ఐఎఎస్ కి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మహిళా సంక్షేమ కమిటీ విజ్ఞప్తి చేసింది.శుక్రవారం రోజున సచివాలయంలో ఆయనను కలిసిన ప్రతినిధి బృందం,మహిళా జర్నలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు.మహిళా జర్నలిస్టులకు తమ వాటా ప్రకారం అక్రెడిటేషన్లు ఇచ్చే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని కోరారు.ప్రతి మీడియా సంస్థలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అది కూడా అమలు కావడం లేదని వారు విచారం వ్యక్తం చేశారు.విశాఖ గైడ్లైన్స్ ప్రకారం ప్రతి మీడియా సంస్థలోనూ జెండర్ సెన్సిటివిటీ వర్క్ షాప్స్ జరగాలనే నిబంధన కూడా కాగితాలకే



పరిమితమైందన్నారు.ఇప్పటినుంచైనా విశాఖ గైడ్లైన్స్ ప్రతిచోటా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఐసీసీ గైడ్లైన్స్ పాటించని సంస్థలకు అక్రెడిటేషన్లు ఇవ్వరాదనే నిబంధనను తీసుకురావాలని వారు కోరారు. ఐసీసీలో ఇచ్చే ప్రతి కంప్లైంట్ మీడియా అకాడమీ దృష్టికి కూడా తీసుకువచ్చేలా అకాడమీ ఆవరణలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.తమ సంస్థలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల జాబితాను ప్రతి మీడియా సంస్థ కచ్చితంగా ఆరు నెలలకోసారి మీడియా అకాడమీకి సమర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో మహిళా జర్నలిస్టులకు 33 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని, అక్రెడిటేషన్ లతో సంబంధం లేకుండా మహిళా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరీ చేయాలన్నారు. ఆయా మీడియా సంస్థలు పూర్తి స్థాయి మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంపును ఆరు నెలలకోసారి నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు.మీడియా సంస్థల్లో పనిచేసే మహిళ ఉద్యోగులకు రాత్రివేళల్లో తప్పనిసరిగా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు.విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు,ఇబ్బందులు,మహిళా జర్నలిస్టుల భద్రత,ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతినిధి బృందం కోరింది. పైఅంశాలపై ప్రభుత్వంతో చర్చించి, విధివిధానాలను రూపొందించి,మహిళా జర్నలిస్టుల సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిషనర్ హామీ ఇచ్చారు.మహిళా జర్నలిస్టుల సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే మహిళా సంక్షేమ కమిటీ బాధ్యులు కళ్యాణం రాజేశ్వరీ,యశోద,ప్రతిభ,వాకా మంజుల,యన్ రాజేశ్వరి,తరుణ, సాజిదా బేగంలు ఉన్నారు.

# రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవమానించడం సబబు కాదు...

కబురు న్యూస్, వీణవంక, డిసెంబర్ 20.

ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని తక్కువగా చేసి మాట్లాడుతూ... దేశ ప్రజలు పదేపదే అంబేద్కర్ పేరును స్మరించకూడదని,దళితులు,అంబేద్కర్ వారసులు గాని దేశంలో వాళ్ళని ఉనికి లేకుండా వాళ్ళను భయభ్రాంతులను చేస్తూ కేంద్రమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడడం విడ్డూరంగా ఉందని,ఇలాంటి చౌక బారు మాటలు మాట్లాడడం సరికాదు ఇంతకుముందు కూడా ఎలక్షన్లలో నాలుగు వందల పై ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పి మరొకసారి అంబేద్కర్ కించపరుస్తూ బిజెపి వాళ్ళ అసలు రూపాన్ని బయటపెట్టుకున్నారు. దేశ ప్రజలు బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు ఇప్పటికైనా వాళ్ళ అస్సరూపం బయటపడిందని వెంటనే పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ కి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని దేశ ప్రజలందరూ,హెచ్చరిస్తున్నారు వచ్చే స్థానిక ఎన్నికల్లో బిజెపిని గ్రామ గ్రామాల్లో మట్టి కరిపించడం ఖాయమని వీణవంక మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మరొకసారి వారిని గుర్తు చేసుకున్నారు.మాదాసీ సునీల్ మార్కెట్ డైరెక్టర్, గంగాడి రాజిరెడ్డి, గొట్టె రాజయ్య,యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి వోరెం అఖిల్,ఆవాల రామకృష్ణ, దాసారపు రమేష్,రాజ కొమురయ్య, మండల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం...

- మహిళ హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి...
- మండల ప్రత్యేక అధికారి నాగార్జున....

కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 20





రాష్ట్ర ప్రభుత్వము ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, మండల ప్రత్యేక అధికారి నాగార్జున సూచించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని కేశవపట్నం, చింతలపల్లె గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల్లో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఫ్రైడే డ్రై డే, కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన మండల ప్రత్యేక అధికారి నాగార్జున మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వము మహిళల, చిన్నారుల ఆరోగ్యం కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, అందులో భాగంగా మహిళల ఆరోగ్యం కోసం, మహిళ హెల్త్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి మహిళ మహిళా హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు పౌష్టికాహారం, అందించడం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి గొట్టే శ్రావణ్ కుమార్, ఎంపీ ఓ కాసగోని భాస్కర్, అంగన్వాడి సూపర్వైజర్లు కవితా, స్రవంతి, గ్రామపంచాయతీ కార్యదర్శి డి నరసయ్య, హెల్త్ సూపర్వైజర్ అనిల్, అంగన్వాడి టీచర్లు సోనీ, సరిత, పద్మ కుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళలు ,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వచ్ఛత పితామహుడు సంత్ గడ్గే వర్ధంతి వేడుకలు...

- ఘనంగా రజక సంఘం ఆధ్వర్యంలో సంత్ గడ్గే బాబా వర్ధంతి వేడుకలు....

కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 20..



స్వచ్ఛత పితామహుడు, పరిశుభ్రత దైవం, చీపురుతో వీధుల్ని, కీర్తనలతో మెదడును సాంఘిక సంస్కర్త స్వచ్ఛత పితామహుడు సంత్ గడ్గే బాబా 68వ జయంతి వేడుకలను కరీంనగర్ జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రజక సంఘం నాయకులు మాట్లాడుతూ సంత్ గడ్గే బాబా ప్రజా ఆరోగ్యం కోసం స్వచ్ఛత పితామహుడు గా తానే స్వయంగా పరిసరాలను పరిశుభ్రం చేసి మనుషుల మెదడును కీర్తనలతో పెంచాడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను ఖండించిన జి రవి ముదిరాజ్

జి రవి ముదిరాజ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు..జి రవి ముదిరాజ్

కబురు న్యూస్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల అమర్యాదగా మాట్లాడిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా. శుక్రవారం రోజున మేడ్చల్ పట్టణం లో ఉమ్మడి మేడ్చల్ మండల అధ్యక్షుల ఆధ్వర్యములో" అంబేద్కర్ కి పాలబిషేకం చేసి, అమిత్ షా చేసినా వాక్యాలను తీవ్రంగా ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన కార్యక్రమం చెప్పట్టడం జరిగింది, ఈ యొక్క నిరసన కార్యక్రమం లో ఉమ్మడి మేడ్చల్ మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

# అంబేద్కర్ పైన గుడ్డి ప్రేమను చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ

కబురు న్యూస్, మెదక్ నర్సాపూర్.



పోతురాజు అనిల్ బీజేపీ మెదక్ జిల్లా యువ మోర్చా నాయకులు కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ కు వారసులమని చెప్పే ప్రయత్నం చేస్తుంది, రెండుసార్లు అంబేద్కర్ ని ఓడించిన పార్టీ కాంగ్రెస్ ప్రత్యక్ష ఎన్నికల్లో అంబేద్కర్ నీ ఓడించడమే కాకుండా, తమ కుటుంబానికి భారతరత్న ఇచ్చుకున్న కాంగ్రెస్ పార్టీ, ఈ దేశ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారికి మాత్రం భారతరత్న ఇవ్వలేదు, కాగా ఓట్ల కోసం బిఆర్ అంబేద్కర్ వారసులమని చెప్పుకుంటున్నారు, అంబేద్కర్ నడయాడిన ప్రాంతాలను పంచ తీర్త్ గా బిజెపి సర్కార్ అభివృద్ధి చేసింది, అంబేద్కర్ కు చేసిన అవమానాలను దేశం ముందు పెడితే.. తట్టుకోలేక కాంగ్రెస్ నేతలు సంయమనం కోల్పోతున్నారు ఇక నైనా అంబేద్కర్ గారిని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తే ఊరుకునేది లేదని హెంచరిస్తున్న

## కేంద్ర మంత్రి అమిత్ షా ఫ్లెక్సీ దహనం.

కబురు న్యూస్, దినపత్రిక మెదక్ నర్సాపూర్.





రాజ్యసభలో కేంద్ర హోం శాఖ మంత్రి అయి బాధ్యత గల హోదాలో అమీ త్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల కు నిరసనగా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆయన విగ్రహం వద్ద బస్టాండ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి , దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిరసన చేసినారు అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, రాజిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్రమంత్రిగా బాధ్యత గల హోదగాలో కేంద్ర మంత్రిగా ఉండి. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని అవమానించిన విధానం అమిత్ షా గారికి తగదు అని ఘాటుగా విమర్శించారు.

## జాతీయ కౌన్సిల్ సమావేశాలకు హాజరైన సమ్మయ్య.....

కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 20






ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ ఏఐటిసి జాతీయ కౌన్సిల్ సమావేశానికి శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు, పిట్టల సమ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సమయ మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఒరిస్సా రాష్ట్రంలోని పూరి జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశానికి కేంద్ర నాయకులు తనకు ఆహ్వానం పంపడంతో, ఆలిండియా ట్రేడ్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని, బిల్డింగ్ వర్కర్స్ సమస్యలపై సమావేశంలో వివరించినట్లు సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ,రాష్ట్ర, జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్జీ3 జి.యం




కబురు న్యూస్, రామగిరి , డిసెంబర్ 20.

ఈనెల 23న నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వేదిక, స్టాల్స్, పార్కింగ్, లైటింగ్ మొదలగు ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత విభాగాల అధికారులకు సూచనలు ఇచ్చారు. 23 న సాయంత్రం ఆరు గంటల నుండి నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకలను సింగరేణి ఉద్యోగులు, కాలనీవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వారితో పాటు ఎస్వోటు జియం జి.రఘుపతి, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటి అధికారి షబిరుద్దీన్, ఎస్ఇ సతీష్ చంద్ర, అధికారులు గుర్రం శ్రీహరి, రామకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరి సీడ్ ఉత్పత్తిదారులకూ బోనస్ చెల్లించాలి..

- డాక్టర్ కవ్వంపల్లి నేతృత్వంలో మంత్రిని కలిసిన సీడ్స్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు

కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 20



వరి సీడ్ విత్తనాల ఉత్పత్తిదారులకు కూడా 500 రూపాయల బోనస్ చెల్లించాలని సీడ్స్ మెన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో సీడ్స్ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్వీ రామకృష్ణ, సంఘ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

సన్నరకం వరి పండిస్తున్న రైతులకు ఇస్తున్న మాదిరిగానే వరి సీడ్ ఉత్పత్తిదారులకు కూడా 500 రూపాయల బోనస్ ప్రకటించాలని ఆ వినతిపత్రంలో కోరారు. ప్రభుత్వాల ప్రోత్సాహకాల వల్ల విత్తన కేంద్రంగా తెలంగాణ ఎదిగిందని, మొక్కజొన్న, పత్తి, వరి, జొన్నలు వంటి పంటలతో 60 నుండి 70 శాతం వరకు విత్తనాలు సరఫరా చేయడం ద్వారా తెలంగాణ ఇప్పుడు దేశవ్యాప్తంగా రైతుల అవసరాలను తీరుస్తున్నదని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో వరి విత్తనోత్పత్తి విస్తీర్ణం రెండు లక్షల హెక్టార్లకు పైగా ఉందని, ఖరీఫ్, రబీలో 110 లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి జరిగిందని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలలో విత్తనోత్పత్తి ఖర్చు తక్కువగా ఉందని, విత్తన కంపెనీలు తమ విత్తనోత్పత్తి కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విస్తరిస్తున్నాయని, ఆ రాష్ట్రాల్లో విత్తనోత్పత్తిని ప్రోత్సహించడమే ఇందుకు కారణమని, వరి సీడ్ విత్తనాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వపరంగా చేయూతనందించాలని, సన్న రకం వరి పండిస్తున్న రైతుల మాదిరిగానే వరి సీడ్ ఉత్పత్తిదారులకు కూడా బోనస్ చెల్లించాలని వారు కోరారు.

సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్..

వరి సీడ్ ఉత్పత్తిదారులకు కూడా బోనస్ కింద 500 రూపాయలు ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖామంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సూత్రప్రాయంగా హామీ ఇచ్చారు. ఈ మేరకు సంబంధితశాఖ ఉన్నతాధికారులను పిలిపించి, సన్నరకం వరి పండిస్తున్న రైతుల మాదిరిగానే వరి సీడ్ ఉత్పత్తిదారులకు బోనస్ ఇచ్చే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు.

మంత్రిని కలిసిన బృందంలో అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వై లక్ష్మారెడ్డి, గౌరవ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,కార్యదర్శి ఎస్ రమణారావు,కోశాధికారి తిరుపతిరావు, కార్యవర్గ కమిటీ సభ్యులు పి శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి,మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సనాతన హిందూ ధర్మాన్ని కించపరిచే విధంగా వ్యవరిస్తే తిరుగుబాటు తప్పదు....

- హిందూ ఐక్యవేదిక డిమాండ్..

కబురు న్యూస్, జమ్మికుంట డిసెంబర్ 20...





కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ మండల సరస్వతి శిశు మందిర్ లో హిందువులపై, హిందూ ధర్మంపై, మన సంస్కృతి సంప్రదాయాలను దెబ్బతీస్తున్న కొన్ని మతసంస్థలు వారి పద్ధతులు మార్చుకోకపోతే హిందూ సమాజం తిరుగుబాటు చేస్తుందని, మన దేశం సొమ్మతిని మనల్ని కించపరిచే ఊకునే ప్రసక్తి లేదని జమ్మికుంట హిందూ ఐక్యవేదిక డిమాండ్ చేస్తుంది అదేవిధంగా మన ప్రాంతంలో హిందూ దేవాలయాల్లో కానీ, హిందూ సంస్థలు కానీ, అయ్యప్ప, హనుమాన్ మాలదారులు కానీ ఏ కార్యక్రమం చేపట్టిన కూడా ప్రజలు ఆ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని పలు వక్తలు హిందూ సమాజానికి పిలుపునిచ్చారు.

జమ్మికుంట పట్టణంలోని వర్తక సంఘం ఫంక్షన్ హాల్ లో నేటి మధ్యాహ్నం హిందూ ఐక్యవేదిక మరియు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి పలువురి అభిప్రాయాలను వ్యక్తపరిచి మన సమాజంపై చులకన చేసే వారిని సహించేది లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు గుండా వరప్రసాద్, ఆకుల రాజేందర్, ఎలిమిలి రాజేంద్రప్రసాద్, సిరిమల్ల జయేందర్, డింగరి రవికుమార్, శీలం శ్రీనివాస్ ,సముద్రాల వరప్రసాద్, కపర్తి శర్మ, దుర్గా శర్మ, ఆవాల రాజారెడ్డి, బుర్ర శివయ్య, ఉప్పుల శ్యామ్, ఎక్కడి రగోతంరెడ్డి, కేతిపల్లి మాధవరెడ్డి, కనబోయిన గోపీనాథ్, కొండ్ల నాగేష్, బచ్చు శివకుమార్, యమసాని సమ్మయ్య, దాసరి రవీందర్, పోతిరెడ్డి నాగయ్య, గర్రెపల్లి నిరూపమారాణి, నాగపూర్ విజయ్, కురుమిళ్ళ అశోక్, శివానందం తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన వెల్ బేబీ షో

కబురు న్యూస్, రామగిరి , డిసెంబర్ 20.



సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక డిస్పెన్సరీ నందు సింగరేణి ఉద్యోగుల కుటుంబాల చిన్నారులకు నిర్వహించిన వెల్ బేబీ షో పోటీలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వేంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబాల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబాల చిన్నారులను ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచడాన్ని ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలను గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తుందన్నారు. పిల్లలకు వారి చిన్నతనం నుంచే కుటుంబ బంధాలపై అవగాహన కల్పించాలని, క్రమశిక్షణతో పాటు మంచి అలవాట్లు నేర్పిస్తే భవిష్యత్తులో రాణిస్తారన్నారు. పిల్లల అల్లరిని, ఏడుపును తగ్గించడం కోసం తల్లిదండ్రులు సెల్ ఫోన్ ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. పిల్లలను ప్రకృతికి దగ్గరగా పెంచేలా చూడాలని సూచించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు స్థానిక రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణం నందు ఈనెల 23న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయబడునని తెలియజేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు ఎన్.అలివేణి సుధాకరరావు, కె.విజయలక్ష్మి వేంకటేశ్వర్లు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఎస్వోటు జియంలు జి.రఘుపతి, బి.సత్య నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డాక్టర్లు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆదినారాయణ, పద్మ, నజ్మా, డిపియం గుర్రం శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున...

## ఉచిత బస్సు ప్రయాణంతో జీవనోపాధి కరువు...

- కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి...
- ఆటో కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు కిషోర్..

కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 20




తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణాలతో ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డునపడి, ఎంతోమంది కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలు చేసుకున్నారని, కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఆటో కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు సుంకర కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాష్ట్ర సంఘం పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతారని ముందస్తుగా శంకరపట్నం మండల్ ఆటో కార్మికులను కేశవపట్నం పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము 6 గ్యారంటీల అమలులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలను కొనసాగిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణాలను మహిళలు వినియోగించుకోవడంతో, అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, అనేకమంది ఆటో కార్మికులు కుటుంబ పోషణ భారంగా మారడంతో, మనస్థాపం చెంది ఆత్మహత్యలకు పాల్పడ్డ ఘటనలు ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకునే అందుకు తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గం ఆర్థిక సహాయం, ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆటో కార్మికుల రాష్ట్ర సంఘం పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతామని, ముందస్తుగా కేశవపట్నం పోలీసులు మండలంలోని ఆటో కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము, ముఖ్యమంత్రి , మంత్రివర్గము ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో సంఘం నాయకులు, కార్మికులు, ఎండి సాజిద్ కాపర్తి మల్లేశం ఊరికే తిరుపతి, దాసారపు రమేష్, తదితరులు ఉన్నారు.

# కేటీఆర్ గారిని అరెస్టు చేయొద్దని ఉత్తర్వులు

### తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు



**కబురు న్యూస్, హైదరాబాద్ డిసెంబర్ 20 ,**

రేవంత్ రెడ్డి గారు అక్రమంగా బనాయించిన కేసును పరిశీలించిన హైకోర్టు కేటీఆర్ గారిని అరెస్టు చేయొద్దని ఉత్తర్వులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం.కేటీఆర్ గారు తొలి అడుగులోనే నైతిక విజయం సాధించారు. వారికి అభినందనలు.హైకోర్టు ఉత్తర్వులతో ఇది డొల్ల కేసును తేటతెల్లమైంది. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు. గోబెల్స్ ప్రచారం చేసారు.ఇ కారు రేసింగ్ మీద సభలో చర్చ జరపాలని అడిగాం. వాస్తవాలు ప్రపంచానికి చెబుదాం, ప్రజలకు వాస్తవాలు తెలియాలి అని అడిగినం.స్పీకర్ గారిని మొన్నే కలిసి అడిగాం. ఈరోజు సభలో అడిగాం మిమ్మల్ని బయటకు పంపి సభలో చర్చ కొనసాగించారు.కేసు పెట్టవద్దు అని మేం అడగటం లేదు, చర్చ పెట్టండి అని అడిగాం. ఎందుకు ఒప్పుకోలేదు. ప్రజలకు వాస్తవాలు తెలియవద్దా.ఫార్ములా ఇ రేసులో 600 కోట్ల అవినీతి అంటూ సీఎం అసత్యాన్ని చెప్పే ప్రయత్నం చేసిండు మిగతా 50శాతం చెల్లించకపోవడం వల్ల రద్దు చేసుకుంటున్నాం, అందుకు అగ్రిమెంట్ రద్దు చేసుకుంటున్నం అని సదరు సంస్థ చెప్పింది.45లక్షల పాండ్స్ అంటే సుమారు 47 కోట్లు. కాని రేవంత్ రెడ్డి గారు 600 కోట్ల నష్టం అంటున్నారు. మేం సభలో లేకుంటే శుద్ధ తప్పులు చెప్పిండు. వాస్తవానికి 700 కోట్ల లాభం రాష్ట్రానికి జరిగింది.రేవంత్ తుగ్లక్ పనుల వల్ల, పిచ్చి పని వల్ల 700 కోట్ల నష్టం రాష్ట్రానికి జరిగింది.ఫార్ములా ఇ రేస్ నిర్వహణ వల్ల ఆరేడు వందల కోట్లు హైదరాబాద్ కు మేలు జరిగింది అని 2022లో నీల్సన్ అనే ప్రఖ్యాత సంస్థ చెప్పింది.రేవంత్ రెడ్డి మాటలు శుద్ధ అబద్ధం. రాష్ట్ర ఇమేజ్ ని దెబ్బ తీసిండు రేవంత్ రెడ్డి. అసలు కేటీఆర్ గారి మీద కేసు ఎందుకు పెట్టారు. అవినీతి జరగలేదు, మరి ఏసీబీ కేసులు ఎందుకు పెట్టింది.రాష్ట్ర ఖజానా నుంచి, నేషనల్ బ్యాంకు నుంచి ఆ సంస్థకు డబ్బులు పంపారు.ఇందులో అవినీతి ఏముంది. ప్రొసీజర్ ల్యాప్స్ జరిగినయి కావొచ్చు, అవినీతి లేదు.పొన్నం ప్రభాకర్ గారే నిన్న అవినీతి జరగలేదు, ప్రొసీజర్ ల్యాప్స్ జరిగింది అన్నడు.వస్తు రూపేనా, ధన రూపేనా అవినీతి జరిగితే ఏసీబీ పని చేస్తది.మే బీ ఇర్రెగ్యులారిటీ బట్ నాట్ ఇల్లీగాలిటీ 2022లో ఈవెంట్ జరిపితే 192 దేశాల ప్రజలు చూసారు. తెలంగాణ ఖ్యాతి పెరిగింది.42 కోట్లతో తమిళనాడులో ఫార్ములా 4 నిర్వహించింది, ఉత్తర్ ప్రదేశ్ 1700 కోట్లతో ఫార్ములా వన్ నిర్వహించింది. 103 కోట్లతో చంద్రబాబు 2003లో ఆఫ్రో ఏషియన్ గేమ్స్ నిర్వహించారు, మీ కాంగ్రెస్ ఢిల్లీలో కామన్ వెల్త్ గేమ్స్ 70వేల కోట్లతో నిర్వహించారు. అదొక స్కాం. మహారాష్ట్ర ముఖ్యమంత్రి షిండే గారు కేటీఆర్ గారిని అభినందించారు.People who blame others for their failures never Overcome Them, they simply move from problem to problem - John C Maxwell, (American Writer & Philosopher)

- ఎవరైతే తమ ఫెయిల్యూర్స్ కి వేరే వారిని బదనాం చేస్తరో వారు ఎప్పటికీ ఆ ఫెయిల్యూర్ నుంచి బయటపడలేరు. సమస్యల నుంచి బయట పడలేక ఒక సమస్య నుంచి మరొక సమస్య సృష్టిస్తుంటరు. అట్లా కాలం వెళ్లదీస్తుంటారు. ఈ సామెత ఏడాది రేవంత్ రెడ్డి పాలనకు అతికినట్లు సరిపోతుంది. అలవిగాని హామీలిచ్చి ప్రజలను మభ్య పెట్టిండు. ముఖ్యమంత్రి అయితే అయ్యిండు గానీ, ఆయన ఇచ్చిన హామీలు ఎట్ల అమలు చెయ్యాలె అని తలుచుకొని భయంల పడ్డడు.ఎట్లనన్న గట్టెక్కాలె. తిమ్మిని బమ్మిని చెయ్యలె అనే ఆలోచనతో హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఏకంగా రాష్ట్రమే దివాళా తీసిందనే దివాలాకోరు ప్రచారం మొదలు పెట్టిండు.రాష్ట్రం దివాల తీసింది అన్నడు. పెట్టుబడులు రావటం లేదు. దివాలా దివాలా అని తాను తవ్వుకున్న గోతిలో తానే పడ్డడు. ఏడు లక్షల కోట్ల అప్పు కాదు, నాలు లక్షల 17వేల కోట్ల అప్పే అని శాసన సభ సాక్షిగా నోరు మూయించినం.

గ్యారెంటీల గారడీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిండు. రాష్ట్ర పరపతి, ప్రతిష్టను దెబ్బతీసిండు.మార్పు మార్పు అని అధికారంలోకి వచ్చిన్రు. ఏడాది కాలంలో ఏం మార్పు వచ్చింది. అని ఓ తత్వవేత్త అన్నడు. కాంగ్రెస్ చేతికి అధికార మార్పిడి తప్ప, ప్రజల జీవితాల్లో ఏం మార్పు వచ్చిందనీ ప్రభుత్వం మీద గట్టిగ మాట్లాడితే చాలు కేసులు. ఇచ్చిన హామీలు ఏమైనయి అంటే చాలు అరెస్టులు రోడ్డెక్కి శాంతియుతంగా నిరసన తెలిపినా నిర్బంధాలు.ఏం చేసిండు మా కేటీఆర్ గారు. నీ అవినీతి బండారాన్ని సిస్టమేటిక్ గా ఎప్పటికప్పుడు బయటపెడుతున్నడు.నీ స్కాంలను, నీ స్కీంలను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతున్నడు.నీతో సహా నీ బ్రదర్స్, నీ అల్లుడు, నీ బామ్మర్ది బాగోతాలను బయటపెట్టి మీకు నిద్ర లేకుండా చేస్తున్నడు.ప్రజల భవిష్యత్తు గురించి కాదు, నీ ఆర్ ఆర్ బ్రదర్స్ గురించే ఫోర్త్ సిటీ, ఫిఫ్త్ సిటీ అని ప్రజలకు అర్థమయ్యేలా వివరించిండు. మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో నువ్వు చేస్తున్న లూటిఫికేషన్ ను బయటపెట్టిండు. ఇవన్నీ చేసిండు కాబట్టి, నీకు వశపడక. ఏదో ఒక కేసు పెట్టాలె, ఎట్లనైనా జైల్లో వేయాలనే కుట్రకు కొన్ని నెలలుగా తెరలేపినవు.అరెస్టులతో లీడర్లను, క్యాడర్ ను భయభ్రాంతులకు గురిచేసి నీ కుంభకోణాలను, లంబకోణాలను యథేచ్చగా కొనసాగించుకోవాలని చూస్తున్నవు.కేటీఆర్ చేసిన తప్పేంది.ప్రతిష్టాత్మకమైన ఫార్ములా ఇ రేసును హైదరాబాదుకు తెచ్చిండు.గ్లోబల్ సిటీగా ఉన్న హైదరాబాద్ ను ఈవీ రంగంలో ఇన్వెస్ట్ మెంట్స్ కి డెస్టినేషన్ గా మార్చాలనుకున్నడు.అది కేటీఆర్ తప్పా? 2023లో రూ. 30 కోట్ల ప్రభుత్వ ఖర్చుతో ఫార్ములా ఇ రేసు నిర్వహిస్తే, రాష్ట్ర జీఎస్డీపీకి రూ. 700 కోట్లు సమకూరిందని నీల్సన్ అనే ప్రతిష్టాత్మకమైన సర్వే సంస్థ చెప్పింది.సాధారణంగా ఇలాంటి రేసులకు సంబంధించి హోటళ్లకు 12శాతం జీఎస్టీ ఉంటది. రేసులకు 28శాతం జీఎస్టీ ఉంటది. సగటున తీసుకున్నా రూ. 700 కోట్లకు గాను జీఎస్టీ కింద సుమారు 20శాతం జమ అయి ఉంటది. అందులో 10శాతం నేరుగా రాష్ట్ర ఖజానాకు వస్తది. ఇంకో 10 శాతం కేంద్రం ఖజానాకు పోతది.అంటే రాష్ట్రం రూ. 30 కోట్లు పెట్టుబడి పెడితే రూ. 70 కోట్ల జీఎస్టీ రాష్ట్ర ఖజానాకు, మరో రూ. 70 కోట్లు కేంద్ర ఖజానాకు వెళ్లింది. కేంద్రానికి వెళ్లిన 70 కోట్లలో రాష్ట్రవాటా కింద 2.102 శాతం డెవల్యూషన్ కింద సుమారు కోటిన్నర రూపాయలు మళ్లీ రాష్ట్ర ఖజానాకే వస్తయి.అంటే కేటీఆర్ చేసింది ఏంటి. రూ. 30 కోట్లు ఖర్చు చేసి రూ. 71.50 కోట్లు రాష్ట్ర ఖజానాకు సమకూర్చిండు. అది తప్పా? ఇదే ఈవెంట్ మూడేళ్లు నిర్వహించేందుకు గాను ప్రభుత్వంతో ఒప్పందం కుదిర్చిండు.ఎలక్షన్ కోడ్ వయొలేషన్ ఉంది అన్నడు. నిర్ణయం ఏడాది క్రితం అయ్యింది. ఎన్నికల కోడ్ రాకముందే అంతా జరిగింది. ఆన్ గోయింగ్ ప్రాసెస్ కు కోడ్ ఉండదు. ఒక వేళ ఉంటే ఎలక్షన్ కమిషన్ చూస్తది. ఏసీబీ కి ఏం సంబంధం. ఏ1 కేటీఆర్, ఏ2 అధికారి, అయితే ఆ కంపెనీ మీద ఎందుకు పెట్టలేదు.మొన్న సాయంత్రం 5 గంటలకు దానకిషోర్ గారు ఫిర్యాదు చేసారు. 24 గంటలు జరగకముందే కేసు పెట్టారు. దీని వెనుక కుట్ర రాష్ట్ర ప్రజలకు స్పష్టం.కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇప్పుడు ఏదో శోధించినట్లు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నరు.ఆ డైవర్షన్ లో భాగమే.. కేటీఆర్ మీద పెట్టిన కేసు.ఈ రేవంత్ రెడ్డికి అటు విజన్ లేదు, ఇటు విజ్డమ్ లేదు.రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయం వల్ల తెలంగాణ ప్రతిష్ట దిగజారే పరిస్థితి వచ్చింది ఇక్కడ ఇంటర్ నేషనల్ రేసు మూడేండ్లు జరగాల్సి ఉంటే, దాన్ని మధ్యంతరంగా రద్దు చేసిండు.ఈ పాటి దానికి, ఈ సుద్దపూస 2036 లో హైదరాబాద్ లో ఒలింపిక్స్ నిర్వహిస్తడట.కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తడన్నట్లు. ఆల్రెడీ ఒప్పందం అయి మూడేళ్లు రేసు నిర్వహించే అవకాశం ఉన్న ఇంటర్నేషనల్ ఈవెంట్ ను రద్దు చేసి, ఒలింపిక్స్ నిర్వహిస్తానని డబ్బా కొడుతున్నడు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా రద్దు చేయడం వల్ల నష్టం జరిగిందని లండన్ లో ప్రభుత్వం మీద కేసు వేసింది.ఆ కేసు గెలిస్తే రాష్ట్ర ప్రతిష్ఠ మరింత తగ్గుతది.ఇది కేటీఆర్ గారికి సంబంధించిన అంశం కాదు, నాలుగు కోట్ల ప్రజలకు సంబంధించినది.రాష్ట్ర ప్రతిష్ఠ, దేశ ప్రతిష్ఠ దిగజారింది. దిస్ విజన్ లెస్ చీఫ్ మినిస్టర్.. రూయిండ్ ద హైదరాబాద్ బ్రాండ్ అండ్ తెలంగాణ స్టేట్ ఇమేజ్. (This vision less Chief minister ruined the Hyderabad brand and Telangana State Image)ప్పులు అప్పులు అని దివ్యంగా వెలుగుతున్న రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రం అన్నడు.ఇవాళ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు రాకుండా పోయినయి. ఉద్యోగ కల్పనకు దిక్కు లేకుండా పోయింది.ఎవడన్నా అకల్ ఉన్నోడు నేషనల్ మీడియా ఇంటర్వ్యూలో ఎల్ అండ్ టీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ను లోపలేయాలని పోలీసులకు చెప్పిన అని గర్వంగా చెప్పుకుంటడా. అంతకుమించిన తలకుమాసినోడు ఎవడన్న ఉంటడా? ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎల్ అండ్ టి సంస్థకు చెందిన మెట్రో సీఈఓను లోపలేస్తా అన్నడు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ మాజీ కేంద్రమంత్రి దివగంత దాసరి నారాయణ రావు గారు గతంలో చంద్రబాబు పాలన ఎట్లుండెనో చెప్పేందుకు ఓ సినిమా తీసిండు.ఆ సినిమా పేరు " పిచ్చోడి చేతిలో రాయి"అట్లనే రేవంత్ రెడ్డి కూడా ఎప్పుడు, ఎవరి మీద పడుతడో, ఏం కేసులు పెడతడో తెల్వకుండా అయ్యింది.శుక్రవారం వచ్చిందంటే చాలు అందరూ భయపడే పరిస్థితి. రైతుల మీద కేసులు, విద్యార్థుల మీద కేసులు, ఆటో డ్రైవర్ల మీద కేసులు, అంగన్ వాడీల మీద కేసులు, ఆశాల మీద కేసులు, చివరకు ఎక్కడి పోయిందంటే.. పోలీసుల మీద కూడా కేసులు పెట్టించిండు. సినిమా వాళ్ల మీద కూడా కేసులు పెట్టించిండు.ఆయన పాలనా వైఫల్యాలపై అడుగడుగునా నిలదీస్తున్న ప్రతిపక్ష నాయకుల మీద కేసులు పెట్టడం పెద్ద విషయమా?కేటీఆర్ మీద కేసులు పెట్టిండు, నా మీ పెట్టిండు, తలసాని మీద పెట్టిండు, పల్లా మీద పెట్టిండు, కౌశిక్ రెడ్డి మీద పెట్టిండు... మా పట్నం నరేంద్ రెడ్డి అయితే నిన్ననే జైలు నుంచి బయటికి వచ్చిండు.పోలీసులతో దబాయించు, అక్రమ కేసులు బనాయించు, అబద్దాలతో బుకాయించు.ఢిల్లీలోనేమో రాజ్యాంగ పరిరక్షణ కావాలె, గల్లీలోనేమో రాజ్యంగ భక్షణ చెయ్యాలె.125 అడుగుల అంబేద్కర్ కే తాళం వేసి పెట్టిన ఘనత రేవంత్ రెడ్డిది.ఎండాకాలం వడ దెబ్బ తప్పించుకోవచ్చు గానీ, రేవంత్ రెడ్డి హైడ్రా దెబ్బ తప్పించుకోలేక రియల్ ఎస్టేట్ ఢమాల్ అయ్యింది.నువ్వు ఎన్ని కేసులు పెట్టినా, మా కేటీఆర్ గారు నీ వెంటపడటం మానరు, నీ బండారం బయటపెట్టడం ఆపరు.ఈ పిచ్చి కేసులకు భయపడి మా లీడర్లు గానీ, క్యాడర్లు గానీ ఎక్కడా తగ్గరు. కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ కోసం పోరాటం చేసినోళ్లం. వెనుకడుగు వేసిది లేదు.కేసు నమోదు కాగానే ఇడి ఇన్వాల్వ్ అవుతున్నది. ఏసీబీని వివరాలు అడుతున్నదని వార్తలు చూస్తా.

కాంగ్రెస్ బీజేపీ కుమ్మకయ్యారు. చోటే బాయ్ బడా బాయ్ బంధం భయట పడింది.సివిల్ సప్లైలో కుంభకోణం జరిగింది, రేవంత్ రెడ్డిపై విచారణ జరపాలని అడిగితే చేయరు.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద రైడ్ అయ్యింది. ఏమైందో ఎవరూ చెప్పరు.అమృత్ స్కాం గురించి ఢిల్లీ వెళ్లి చెప్పినా, ఎవ్వరూ స్పందించరు.మీరు ఎన్ని కేసులు పెట్టినా భయపడం. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తం. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం. హైదరాబాద్ ప్రజలు మిమ్మల్ని ఆశీర్వదించారు. అన్ని వర్గాల ప్రజలు గులాబీ జెండాకు జై కొట్టారు.సగం మంది రుణమాఫీ ఎగ్గొట్టినోడికి, రైతుబంధు ఎగ్గొట్టినోడికి, ఫీజు రీయింబర్స్ మెంట్ ఎగ్గొట్టినోడికి, జాబ్ క్యాలెండర్ ఎగ్గొట్టినోడికి, పింఛన్ల పెంపుదల ఎగ్గొట్టినోడికి, మహిళలకు 2500 ఎగ్గొట్టినోడికి, ఆడబిడ్డలకు తులం బంగారం ఎగ్గొట్టినోడికి, నిరుద్యోగ భృతి ఎగ్గొట్టినోడికి...మొత్తంగా అభయహస్తం మేనిఫెస్టోనే ఎగ్గొట్టినోడికి కేసులు పెట్టుడు తప్పం ఇంకే చాతనైతది.ఇప్పటికైనా పిచ్చి ప్రయత్నాలు మానుకో. రాష్ట్రం కోసం పని చేయాలని కోరుతున్నాను.

---

## బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మూతో ప్రత్యేకంగా భేటీ అయిన ఎస్టి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



### పార్టీలకు అతీతంగా మంత్రి సీతక్క ఆధ్వర్యంలో రాష్ట్రపతితో సమావేశం
### గిరిజన ఆదివాసి ప్రజల అభివృద్ధిపై రాష్ట్రపతి తో 15 నిమిషాల పాటు చర్చ

**కబురు న్యూస్, హైదరాబాద్ డిసెంబర్20**

రాష్ట్రంలో ఎస్టీల పరిస్థితి, వారి సంక్షేమ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాల వివరాలను రాష్ట్రపతికి నివేదించిన ఎమ్మెల్యేలు తెలంగాణలోని ఎస్టీల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు వచ్చేలా ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్రపతిని కోరిన ఎమ్మెల్యేలు గిరిజనుల గార్డియన్ గా వారి అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు అయ్యేలా చూడాలని రాష్ట్రపతిని విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యేలుఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాష్ట్రపతి ఎస్టీల సంక్షేమం కోసం కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తున్నాయి, ఎక్కడెక్కడ ఖర్చు చేస్తున్నారు, ఇంకా ఎన్ని నిధులు కావాల్సి ఉంది అన్న అంశాలపై ఎప్పటికప్పుడు ఎస్టీ ఎమ్మెల్యేలతో సమీక్షలు నిర్వహించి కేంద్రానికి నివేదిక అందజేయాలని మంత్రి సీతక్కను ఆదేశించిన రాష్ట్రపతిరాష్ట్రంలో గిరిజనుల అవసరాలను బట్టి కేంద్రం నుంచి అదనంగా నిధులు మంజూరు చేయించేందుకు చొరవ చూపిస్తానని హామీ ఇచ్చిన రాష్ట్రపతి గిరిజనుల సంక్షేమం కోసం తనతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన మంత్రి సీతక్కను అభినందించిన రాష్ట్రపతి తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాష్ట్రపతి కి కృతజ్ఞతలు తెలిపిన ఎస్టీ ప్రజాప్రతినిధులు

---

## బంజారాహిల్స్ లో భూమి కబ్జా అవాస్తవం

### స్పష్టం చేసిన అధికారులు
### రెవెన్యూ, పోలీసు, హైడ్రా అధికారులతో సంయుక్త తనిఖీ

**కబురు న్యూస్, హైదరాబాద్ డిసెంబర్ 20**

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్.10 లో ఉన్న జలమండలి 2.20 ఎకరాల భూమి కబ్జాకు గురైందని వివిధ మాధ్యమాల్లో ప్రచారమైన విషయం అవాస్తవమని అధికారులు స్పష్టం చేశారు. వివిధ పత్రికలు, మాధ్యమాల్లో జరిగిన ప్రచారంపై జలమండలితో పాటు రెవెన్యూ, హైడ్రా, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో రెండు చోట్ల 2.20 ఎకరాల జలమండలి భూమి ఉందని తెలిపారు. ఒక దగ్గర ఎకరా భూమి ఉందని అక్కడ జలమండలికి చెందిన 6 ఎంఎల్ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ ఉందని తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం. 2, 10, 14 ప్రాంతాల ప్రజలకు ఇదే రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. దీనికి 150 మీటర్ల దూరంలో మరో 1.20 ఎకరాలు ఉందని చెప్పారు. అయితే ఇది రాళ్లతో కూడిన ఖాళీ స్థలం కావడంతో రెవెన్యూ అధికారుల చేత సర్వే నిర్వహించి స్పష్టమైన సరిహద్దులు కూడా ఏర్పాటు చేశామన్నారు. దీంతోపాటు ఈ స్థలంపై తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ సైతం ఉన్నట్లు వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకే అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని తెలిపారు. కాబట్టి, దినపత్రికలు, మాధ్యమాల్లో వచ్చిన ప్రచారం అవాస్తవమని అధికారులు తెలిపారు. ఈ కబ్జా అంశంపై హైకోర్టులో అఫిడవిట్ సైతం దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

## తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవానికి సర్వసిద్ధం

**కబురు న్యూస్, హైదరాబాద్ డిసెంబర్ 20 ,**

ప్రతి ఏటా డిసెంబర్ 21 తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తొలి వేడుకలకు హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియం సర్వం సిద్దమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ – రామచంద్ర మిషన్ ఆద్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీయం మల్లు భట్టివిక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రామచంద్ర మిషన్ అధ్యక్షులు దాజీ , తదితరులు పాల్గొననున్నారు.

---

## వీలైతే నాలుగు మాటలు.. కుదిరితే కప్పు టీ:
### మోదీతో స్నేహంపై పుతిన్

**కబురు న్యూస్, డెస్క్ : డిసెంబర్ 20**



భారత ప్రధాని నరేంద్ర మోదీ తో తనకు మంచి అనుబంధం ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ప్రపంచ నేతల్లో తనకున్న స్నేహితుల్లో ఆయనొకరని తెలిపారు. వార్షిక విలేకరుల సమావేశంలో భాగంగా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. ఈసందర్భంగా ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది.ప్రపంచ నేతల్లో ఎవరితో నాలుగు మాటలు పంచుకుంటూ కప్ టీ షేర్ చేసుకోవాలనుకుంటున్నారని పుతిన్‌కు ప్రశ్న ఎదురైంది. దానికి బదులిస్తూ.. తన మిత్రుల పేర్లు తెలియజేశారు. "జర్మనీ మాజీ ఛాన్సలర్ హెల్ముట్ కోల్, ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు జాక్వెస్ చిరాక్, ఇటలీ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీతో నాకు మంచి అనుబంధం ఉంది. అలాగే ఆసియాలో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నాకు మిత్రులు" అని వెల్లడించారు.

బ్రిక్స్ గ్రూప్ గురించి పశ్చిమదేశాలు వ్యక్తంచేస్తోన్న ఆందోళనను ఉద్దేశించి ఓ సందర్భంలో భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ చేసిన వ్యాఖ్యను పుతిన్ ప్రస్తావించారు. "బ్రిక్స్ పశ్చిమదేశాలను వ్యతిరేకించే గ్రూప్ కాదు. అలాఅని వాళ్ల గ్రూప్ కూడా కాదు. అది మంచి వ్యాఖ్య. అది ఏ దేశానికి వ్యతిరేకంగా పనిచేయడం లేదు. సభ్య దేశాల ప్రయోజనం కోసం మాత్రమే పనిచేస్తుంది" అని పుతిన్ అన్నారు. ఆ గ్రూప్‌లో బ్రెజిల్, చైనా, దక్షిణాఫ్రికా, రష్యా, ఇండియా సభ్యదేశాలు.పుతిన్ సందర్భం వచ్చినప్పుడల్లా ప్రధాని మోదీతో ఉన్న స్నేహం, భారత్ అనుసరిస్తోన్న విధానాలను ప్రశంసిస్తుంటారు. ఈ ఏడాది రెండుసార్లు మోదీ రష్యాకు వెళ్లారు. ఈ అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న ఆయన దౌత్యం, చర్చలకు భారత్ మద్దతిస్తుందని, యుద్ధానికి కాదని పునరుద్ఘాటించారు. ఇదిలాఉంటే.. భారత్ పంపిన ఆహ్వానం మేరకు పుతిన్ కూడా త్వరలో మన దేశంలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించి 2025 ప్రారంభంలో తేదీలు ఖరారు చేస్తామని క్రెమ్లిన్ వెల్లడించింది. ప్రతిఏటా ఒకసారి సమావేశం కావాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారని.. ఇందులోభాగంగా ఈసారి పుతిన్ భారత్‌కు రానున్నారని తెలిపింది.

# ‘లక్కీ భాస్కర్’ అసలైన ఆట అప్పుడే మొదలవుతుంది

## - పరుచూరి గోపాలకృష్ణ



**కబురు సినిమా డిసెంబర్ 20..**

దుల్కర్ సల్మాన్ హీరోగా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రం ‘లక్కీ భాస్కర్’ . మీనాక్షి చౌదరి హీరోయిన్. బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ ‘నెట్‌ఫ్లిక్స్’ లో సందడి చేస్తోంది. ఈ మూవీపై ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ‘పరుచూరి పాఠాలు’ పేరుతో సంబంధిత వీడియోను పంచుకున్నారు. ఆయన ఏమన్నారంటే? “మధ్యతరగతి మందహాసాలు, మధ్యతరగతి విషాదాలు సినిమా కథలో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్‌ను క్రియేట్ చేయడానికి ఉపయోగపడతాయి. ఒకప్పుడు చాలా సినిమాలు మిడిల్‌క్లాస్ ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లోనే తెరకెక్కాయి. ‘లక్కీ భాస్కర్’ విషయంలో వెంకీ అట్లూరి చాలా జాగ్రత్త తీసుకున్నారు. కథ ముంబయి చుట్టూ తిరిగినా.. పాత్రలు తెలుగులోనే మాట్లాడతాయని ముందే హింట్ ఇచ్చారు. హీరో ఎంట్రీ సీన్ నాకు బాగా నచ్చింది. ఇందులోని హీరో రోల్ తన కథ గురించి తానే చెబుతుంది. వెంకీ స్క్రీన్‌ప్లేతో ఆడుకున్నారు. డబ్బుని ఎలా కాజేయొచ్చో మూడు, నాలుగు విధానాల్లో చూపించారు. నల్ల ధనాన్ని వైట్ మనీగా ఎలా మార్చొచ్చో కూడా చూపించారు. హీరోకి పెద్ద మొత్తంలో డబ్బు రావడాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. దర్శకుడికి ఆ ఆలోచన ఎలా వచ్చిందో అనిపిస్తోంది”

**లక్కీ భాస్కర్.. డైలాగ్స్**

“సొంత ఇల్లు ఉంది కాబట్టి రూ.10 వేల జీతంతో హీరో కుటుంబాన్ని పోషించగలిగాడు. కథానాయకుడి భార్య అడ్జస్ట్ అవుతూ.. కుమారుడు ఏది అడిగినా తప్పించుకుంటూ ఉంటుంది. కేకు కూడా కొనలేని పరిస్థితి వారిది. కథానాయకుడి కష్టం, కన్నీళ్లు ప్రేక్షకుడి హృదయాన్ని కరిగించాయి. అతడు ఇంకా సంపాదిస్తే బాగుండు అని అనుకునేలోగా డైరెక్టర్ అసలైన స్క్రీన్‌ప్లేతో ఆట ప్రారంభించాడు. మిడిల్‌క్లాస్ భాస్కర్ (హీరో పాత్ర పేరు) రూ.100 కోట్లకు అధిపతి ఎలా కాగలడు?తప్పు చేస్తే అవుతాడు. కానీ, అతడు తన మేథస్సు ఉపయోగించాడు. ప్రపంచంలో ఇలా జరుగుతుందని చెప్పాడేగానీ ఇలా చేయమని దర్శకుడు చెప్పలేదు. అవినీతిమయ ప్రపంచాన్ని చూపిస్తూనే తండ్రీకొడుకుల, భార్యాభర్తల, అన్నాచెల్లెలి అనుబంధాన్ని చూపించారు. భాస్కర్ రాత్రిళ్లు ఆలస్యంగా ఇంటికి వస్తుండడంతో భార్య ప్రశ్నించగా.. ‘బోర్ కొట్టేశానేమో’ అంటూ సహజమైన సంభాషణ చెబుతాడు. ఇందులో ట్విస్టులున్నాయి. కథా కథన చాతుర్యం బాగుంది. ఈ సినిమా రెండు రెట్లు లాభాలు తెచ్చిపెట్టనట్టు తెలుస్తోంది. చిన్న పాత్రను అంగీకరించడంలో హీరోయిన్‌ను అభినందించాలి”“ఈతరం దర్శకులు చాలా మంది ప్రేమ కథలను హైలైట్ చేయకుండా ఇలాంటి కొత్త పాయింట్లను తెరపైకి తీసుకొస్తున్నారు. హీరో-హీరోయిన్ల లవ్‌ట్రాక్ కోసం నిడివి కేటాయించట్లేదు. సందర్భానుసారం వినోదాన్ని పంచుతున్నారేగానీ కామెడీ కోసం సెపరేట్ ఎపిసోడ్ చేస్తూ కథను దారి మళ్లించడంలేదు. కొత్త ఒరవడి సృష్టించారు” అని పేర్కొన్నారు.

# పవన్‌కల్యాణ్.. అద్భుతమైన వ్యక్తి: శ్రియారెడ్డి



**కబురు సినిమా డిసెంబర్ 20..**

‘సలార్’ తో గతేడాది ప్రేక్షకులను అలరించారు నటి శ్రియా రెడ్డి . ప్రస్తుతం ఆమె పవన్‌కల్యాణ్ హీరోగా నటిస్తోన్న ‘ఓజీ’ కోసం వర్క్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియా రెడ్డి.. తాను నటిస్తోన్న సినిమాల గురించి మాట్లాడారు. ముఖ్యంగా పవన్‌కల్యాణ్ ‘ఓజీ’ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు.“గడిచిన ఈ ఏడాది కాలం నాకు ఎంతో ప్రత్యేకం. గతేడాది చివర్లో విడుదలైన ‘సలార్ - సీజ్‌ఫైర్’లో నా పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అందులో నేను ఖాన్సార్ సామ్రాజ్యంలో ఆధిపత్యం వహించేవిధంగా కీలక పాత్ర పోషించా. ఈ ఏడాది విడుదలైన ‘తలైమై సేయలగం’లో రాజకీయ నాయకురాలి రోల్ చేశా. తెలుగు చిత్ర పరిశ్రమలో రానున్న బిగ్గెస్ట్ మూవీల్లో ఒకటైన ‘ఓజీ’లో వర్క్ చేశా. ఈ ఏడాదికాలంలో నన్ను నేను పునర్నిర్మించుకున్నా. ప్రస్తుతానికి నా చేతిలో కేవలం ‘ఓజీ’ మాత్రమే ఉంది. కొన్ని చిత్రాలు ఇంకా చర్చల దశలో ఉన్నాయి. ఇందులో నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ‘సలార్’లోని రాధారమ పాత్రకు, ఈ సినిమాలోని పాత్రకు ఎలాంటి సంబంధం ఉండదు. రెండు పాత్రల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. స్క్రీన్‌పై నన్ను చూసి ప్రేక్షకులు తప్పకుండా ఆశ్చర్యపోతారు” అని తెలిపారు.అనంతరం ఆమె పవన్‌కల్యాణ్‌తో వర్క్ చేయడంపై మాట్లాడుతూ.. “ పవన్‌కల్యాణ్ కాంబినేషన్‌లో ఇప్పటికే కొన్ని సన్నివేశాలు చేశా. ఆయన చాలా తెలివైన, మర్యాద గల వ్యక్తి. ఎంతో హుందాగా ఉంటారు. ఆయనొక అద్భుతమైన వ్యక్తి. ఎదుటి వ్యక్తులతో ఆయన ప్రవర్తన, మాట్లాడే విధానం చూడచక్కగా ఉంటుంది” అని ఆమె చెప్పారు. పవన్‌కల్యాణ్ హీరోగా సుజిత్ తెరకెక్కిస్తోన్న చిత్రమే ‘ఓజీ’. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య దీనిని నిర్మిస్తున్నారు. ప్రియాంకమోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. 2006లో విడుదలైన ‘పొగరు’తో శ్రియారెడ్డి తెలుగు వారికి చేరువయ్యారు. ఇందులో ఆమె నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించారు.

# పుష్ప-2కు ఆ రెండు సినిమాలే టార్గెట్

## ఇప్పటి వరకు రూ.1508 కోట్ల గ్రాస్ దాటిన పుష్ప-2



**కబురు సినిమా డిసెంబర్ 20..**

భారీ అంచనాల మధ్య విడుదలై ఎప్పటిలాగే సౌత్‌తోపాటు నార్తిండియన్ ప్రేక్షకులను ఫిదా చేస్తున్నాడు పుష్పరాజ్. ఐకాన్ అల్లు అర్జున్ సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వచ్చి రికార్డు వసూళ్లతో ట్రెండింగ్ టాపిక్‌గా నిలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై న పుష్ప 2 ది రూల్ ఓపెనింగ్ డేనే జవాన్, ఆర్‌ఆర్‌ఆర్ రికార్డును బద్దలు కొట్టిందని తెలిసిందే. తాజా కలెక్షన్ల రిపోర్ట్‌తో పుష్పరాజ్ మేనియా ఎలా ఉందో అర్థమవుతోంది. పుష్పరాజ్ ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. 15 రోజుల్లోనే రూ.1508 కోట్లు వసూళ్లు రాబట్టి అత్యధిక వేగంగా ఈ మార్క్ చేరుకున్న చిత్రంగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఇప్పటివరకు ఆల్ టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ ఇండియన్ మూవీస్ అమీర్ ఖాన్ దంగల్ (రూ.2070. 30 కోట్లు), బాహుబలి.. ది కంక్లూజన్ (రూ.1786.06 కోట్లు) పేర్లతో ఉన్న రికార్డ్‌ను పుష్ప 2 ది రూల్ అధిగమించడం ఖాయమని తాజా కలెక్షన్లు చెప్పకనే చెబుతున్నాయి. పుష్ప 2 మరికొన్ని రోజుల్లోనే ఈ ఫీట్ చేరుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం కన్నడ సోయగం రష్మిక మందన్నా మరోసారి శ్రీవల్లిగా ఇంప్రెస్ చేసింది. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు.

# అమరన్‌కు అవార్డుల పంట..

## ఉత్తమ నటుడిగా విజయ్‌సేతుపతి



**కబురు సినిమా డిసెంబర్ 20..**

కోలీవుడ్ నుంచి తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్‌డమ్ సంపాదించుకున్న వారిలో లీడింగ్‌లో ఉంటారు విజయ్ సేతుపతి, సాయిపల్లవి. సినిమా సినిమాకు తమ పర్‌ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేయడం ఈ స్టార్ యాక్టర్ల స్పెషాలిటీ. తాజాగా ఇద్దరు ఉత్తమ నటులుగా అవార్డులు అందుకుని వార్తల్లో నిలిచారు. 22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ డిసెంబర్ 19న ముగిసింది. ఈవెంట్‌లో వివిధ కేటిగిరీల్లో అవార్డులను ప్రదానం చేశారు. సాయిపల్లవి ఇటీవలే అమరన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా అవార్డు అందుకుంది. ఈ మూవీ ఉత్తమ చిత్రం, ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగాల్లో అవార్డులు అందుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి మహారాజ చిత్రానికి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు. వీరితోపాటు పలు సినిమాలకు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కాయి.

అవార్డ్ విజేతలు..

అమరన్ :

**ఉత్తమ ఎడిటర్: ఫిలోమిన్ రాజ్**

ఉత్తమ సంగీత దర్శకుడు: జీవీ ప్రకాశ్ కుమార్

మహారాజ :

ఉత్తమ నటుడు: విజయ్ సేతుపతి

ఉత్తమ రచయిత: నిథిలన్ స్వామి నాథన్

ఉత్తమ సహాయ నటి: దుషారా విజయన్ (వెట్టైయాన్)

ఉత్తమ దర్శకుడు (స్పెషల్ జ్యూరీ అవార్డ్) : పా రంజిత్ (తంగలాన్)

ఫేవరేట్ యాక్టర్ అవార్డ్ : అరవింద్ స్వామి

# మరో ఇంట్రెస్టింగ్ సినిమాతో రానున్న అనుపమ.. ఈసారి రియల్ స్టోరీతో..



**కబురు సినిమా డిసెంబర్ 20..**

అందాల భామ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం ఆచి తూచి సినిమాలు చేస్తుంది. హీరోయిన్ గా ఒకొక్క పెట్టు ఎక్కుతూ వస్తున్న అనుపమ పరమేశ్వరన్ కెరీర్ బిగినింగ్ లో గ్రామర్స్ రోల్స్ కు దూరంగా ఉంటూ వచ్చింది. కానీ ఆతర్వాత టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం తన అందాలతో ఆకట్టుకుంది. ఓ రేంజ్ లో అందరు ఆరబోసి అభిమానులను కవ్వించింది ఈ కుర్రది. ఇక ఈ అమ్మడు కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ తోనూ ఆకట్టుకుంటుంది. ఎక్కువగా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకుంటుంది ఈ అమ్మడు. తాజాగా అనుపమ మరో ఇంట్రెస్టింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది.సూపర్ స్టార్ సురేష్ గోపి అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో కాస్మోస్ ఎంటర్టైన్మెంట్స్ పై జె. ఫణీంద్ర కుమార్ నిర్మాతగా ప్రవీణ్ నారాయణ దర్శకత్వంలో వస్తున్న యదార్థ సంఘటనల ఆధారంగా వాస్తవిక దృక్పథ కోణంలో తీసిన సినిమా జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (జె. ఎస్. కె). బైజు సందోష్, మాధవ్ సురేష్ గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఇంటెన్స్ కోర్టు డ్రామాగా ఈ చిత్రాన్ని నిర్మించారు.అనుపమ పరమేశ్వరన్ సినిమాలో జానకి పాత్రలో నటిస్తోంది. యదార్థ సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో జానకి పై జరిగిన అన్యాయాన్ని కోర్టులో ఎలా ఎదుర్కొంది అన్న అంశాన్ని ఇంటెన్స్ డ్రామాగా నిర్మించారు. ఈ కేసును వాదించే లాయర్ పాత్రలో సూపర్ స్టార్ సురేష్ గోపి గారు నటించారు. ఈ సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేస్తామని మూవీ మేకర్స్ తెలిపారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com